రేపటి నుంచి సత్యదేవుడి 134వ ఆవిర్భావ దినోత్సవాలు
పెదబ్రహ్మదేవంలో మైనర్ బాలికపై అత్యాచారయత్నం
యువకుడికి దేహశుద్ధి.. ఇరువర్గాలపైనా కేసులు



అలంకారప్రాయంగా యుద్ధ విమాన మ్యూజియం

'యుద్ధం' చేయాలా?

- ఏళ్లతరబడి అసంపూర్తిగానే యుద్ధ విమానం మ్యూజియం నిర్మాణ పనులు
- అందుబాటులోకి రాని మ్యూజియం
- నిరాశతో వెనుదిరుగుతున్న పర్యాటకులు
- గత వైసీపీ ప్రభుత్వ నిర్వాకంతో జాప్యం

దేశ రక్షణ, భద్రత కోసం భారత త్రివిధ దళాలు అందిస్తున్న సేవలపై చిన్నారులు, విద్యార్థులు, సందర్శకులకు ఆహ్లాదం, వినోదం, విజ్ఞానం పంచేందుకు కాకినాడ బీచ్‌లో ఏర్పాటు చేసిన యుద్ధ విమాన మ్యూజియం వినియోగంలోకి రావడం లేదు. అసంపూర్తి నిర్మాణ పనులు పూర్తి చేయకుండానే వైసీపీ ప్రభుత్వం ఎన్నికల ముందు హడావుడిగా ప్రారంభించి మమ అనిపించడం తో సందర్శకులకు వినోదం, విజ్ఞానం పంచని మ్యూజియంగా యుద్ధ విమానం నిలిచింది. బీచ్ సందర్శనకు వచ్చే పర్యాటకులు, విద్యార్థులు మ్యూజియం వద్దకు రావడం, అక్కడ గేటుకి తాళాలు వేసి ఉండడంతో నిరుత్సాహంగా వెనుదిరుగుతున్నారు. ఇది పూర్తి కావాలంటే ఎవరితో 'యుద్ధం చేయాలని పర్యాటకులు ప్రశ్నిస్తున్నారు.

సర్పవరం జంక్షన్, ఆగస్టు 3: టీడీపీ హయాంలో స్వదేశీ దర్శన్‌నిధులతో ఉమ్మడి జిల్లాలోనే ప్రముఖ పర్యాటక కేంద్రంగా కాకినాడ సూర్యారావుపేట బీచ్‌ను అభివృద్ధి చేసింది. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరితో ఎన్టీఆర్ బీచ్ ప్రాభవం మసకబారిపోయింది. బీచ్ ఫ్రంట్ భవనాలు, వాటర్ ఫౌంటేన్, గ్లాస్ హౌస్ వంటివన్నీ మూతపడడంతో సందర్శకులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అట్టహాసంగా ప్రారంభించిన యుద్ధ విమాన మ్యూజియం అసంపూర్తి పనులు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకువచ్చేలా జిల్లా కలెక్టర్, కూటమి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

టీయూ-142 యుద్ధ విమానం విశేషాలు

టీయూ-142 యుద్ధ విమానాన్ని రష్యా దేశం నుంచి కొనుగోలు చేశారు. కార్గిల్ యుద్ధంలో ఇది విశేష సేవలు అందించింది. ఈ విమానం ఒక్కసారి ఫ్యూయల్ నింపుకుని ప్రపంచ దేశాలను కేవలం 16గంటల్లో చుట్టివచ్చే సామర్థ్యం దీని సొంతం. ఇది గంటకు 925 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తుంది. విమానం పొడవు, వెడల్పులు 50 మీటర్లు, రెక్కల పొడవు 50 మీటర్లు ఉంటుంది. దీని బరువు 90వేల కిలోలు ఉండడం గమనార్హం. ప్రపంచంలోనే అతి భారీ, పురాతన యుద్ధ విమానాల్లో ఒకటైన టీయూ-142 ఎం ఎయిర్ క్రాఫ్ట్ భారత నావికాదళం వైమానిక విభాగంలో 28ఏళ్లపాటు దేశానికి విశేష సేవలు అందించింది. సముద్ర తీర గస్తీ, జలాంతర్గామి నిరోధక సేవలు అందించడంలో ఖ్యాతి గడించిన ఈ యుద్ధ విమానం 2017లో నేవీ నుంచి వైదొలిగి, తమిళనాడులోని అరక్కోణం బేసల్ ఎయిర్ స్టేషన్ ఐఎన్ఎస్ రాజసంలో విశ్రాంతి తీసుకుంటూ ఉండగా.. ఈ పురాతన యుద్ధ విమానాన్ని తమిళనాడునుంచి కాకినాడ బీచ్‌కు 14 భారీ వాహనాల ద్వారా తెనేజా ఏరో స్పేస్ లిమిడెట్ సంస్థ తీసుకువచ్చింది.

సందర్శకులకు కలగానే మ్యూజియం

దేశ రక్షణ, భద్రత కోసం భారతదేశ త్రివిధ దళాలు అందిస్తున్న సేవలపై చిన్నారులు, విద్యార్థులకు వినోదం, విజ్ఞానం పంచేందుకు యుద్ధ విమాన మ్యూజియం ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. టీయూ-142 యుద్ధ విమాన మ్యూజియం నిర్మాణానికి అవసరమైన రూ.9.03 కోట్ల నిధులను గుడా సమకూర్చింది. ఈ మ్యూజియం నిర్మాణ పనులకు 2020, అక్టోబర్‌లో శంకుస్థాపన చేశారు. తొలుత నిర్మాణ పనులు వేగంగా జరిగినా ప్రభుత్వం బిల్లుల చెల్లింపులో తీవ్ర జాప్యం చేయడంతో కాంట్రాక్టర్ నిర్మాణ పనులను జాప్యం చేశారు. మూడేళ్ల అనంతరం నిర్మాణ పనులు పూర్తి చేసి 2023, ఫిబ్రవరిలో యుద్ధ విమాన మ్యూజియాన్ని ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు ప్రారంభించారు. యుద్ధ విమానం లోపల ఏసీ, విద్యుద్దీకరణ పనులు ఇంకా పూర్తి కాలేదు. మ్యూజియం లోపల పూర్తిస్థాయిలో లైటింగ్ వ్యవస్థ ఏర్పాటు చేయలేదు. యుద్ధ విమానంలో యుద్ధ సమయంలో విమానాలను వినియోగించే తీరు, ఆయుధాల నిల్వ, వాటిని ఏవిధంగా ప్రయోగిస్తారు, విమాన టేకాఫ్, ల్యాండింగ్ తదితర వివరాలను తెలియజేసే వ్యవస్థ ఏర్పాటు చేయాలి. ఈ విమానం దేశానికి అందించిన సేవల వివరాలు తెలియజేసే డిస్‌ప్లే, వీడియో, ఆడియో తదితర సమాచార వ్యవస్థ, గేమింగ్ జోన్, విజ్ఞానంపై సమాచారం ఏర్పాటు చేయకుండానే హడావుడిగా ఎన్నికల ముందు వైసీపీ పాలకులు ప్రారంభించారు. మ్యూజియం తిలకించేందుకు వెళ్తే గేటుకు తాళాలు వేసి ఉంటున్నాయని సందర్శకులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దేశానికి విశేష సేవలు అందించిన ఎంతో చరిత్ర కలిగిన యుద్ధ విమాన మ్యూజియం అసంపూర్తి నిర్మాణ పనులు పూర్తి చేసి సత్వరంగా వినియోగంలోకి తీసుకువచ్చేలా అధికారులు, స్థానిక ఎమ్మెల్యే పంతం నానాజీ తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



నెలరోజుల్లో సందర్శనకు అనుమతి

-పి.కృష్ణమూర్తి, వైస్ చైర్మన్ కుడా, కాకినాడ

ఎన్టీఆర్ బీచ్‌లో ఏర్పాటు చేసిన యుద్ధ విమాన మ్యూజియంలో నిలిచిన అసంపూర్తి నిర్మాణ పనులను నెలరోజుల్లో పూర్తి చేసి సందర్శకులను అనుమతించేలా చర్యలు తీసుకుంటున్నా. విమానం లోపల పూర్తిస్థాయిలో విద్యుద్దీకరణతో పాటు ఏసీలు బిగించాల్సి ఉంది. దీనిపక్కన చిల్డ్రన్స్‌కు వినోదం పంచేందుకు పచ్చదనంతో పార్కు అభివృద్ధి, సుందరీకరణ పనులు చేపడుతున్నాం. బీచ్‌లో నుంచి మ్యూజియంలోకి ప్రవేశించే ప్రధాన రహదారి మార్గంలో రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. పర్యాటకులు, సందర్శకులను ఆకట్టుకునేలా బ్యూటిఫికేషన్ పనులన్నీ నెలరోజుల్లో పూర్తి చేయించి నామమాత్రపు ప్రవేశ రుసుంతో సందర్శకులను ఈ మ్యూజియంలోకి అనుమతించడం జరుగుతుంది. పనులు వేగంగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నా.

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థకు..

పెద్దఎత్తున అర్జీలు

- నెలన్నరరోజుల్లో 1548 అర్జీలు
- పరిష్కారం చేసినవి 1069 అర్జీలు
- పెండింగ్‌లో ఉన్నవి 442 అర్జీలు

కలెక్టరేట్(కాకినాడ), ఆగస్టు 3: కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వ్యవస్థకు జిల్లాలో విశేష స్పందన వచ్చింది. కేవలం నెలన్నరరోజుల్లో జిల్లావ్యాప్తంగా 1548 అర్జీలు వచ్చాయి. దీనిలో ఇప్పటివరకు 1069 అర్జీలను అధికారులు సమర్థవంతంగా పరిష్కరించారు. ఇంకా 442 అర్జీలు పెండింగ్‌లో ఉన్నాయి. రెండోసారి పరిశీలించిన 21 దరఖాస్తులు కూడా పరిష్కారమయ్యాయి. 16 దరఖాస్తులు మాత్రం అధికారికంగా ప్రభుత్వం ఇచ్చిన గడువు దాటిపోయిన లిస్టులో చేరాయి. దీనివల్ల వీటిని తక్షణమే అధికారులు పరిష్కరించాల్సి ఉంది. అర్జీలు జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజాఫిర్యాదుల పరిష్కార వ్యవస్థతోపాటు మండలాల్లో నిర్వహించే కార్యక్రమాలు, సీఎం హెడ్‌క్వార్టర్స్ నుంచి వచ్చినవి కూడా ఉన్నాయి. జిల్లాలో ప్రధానంగా ఇళ్లస్థలాలు, ఎన్టీఆర్ భరోసా పింఛన్లు, గృహనిర్మాణాల నిధులకోసం దరఖాస్తు చేసుకున్నారు. గత ప్రభుత్వం నిర్వహించిన భూముల రీసర్వేలో తమ పాస్‌పుస్తకాల్లో భూమి విస్తీర్ణం తప్పుగా నమోదు చేశారనే ఫిర్యాదులు కూడా వెల్లువెత్తాయి. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలపై కూడా అర్జీలను సమర్పించారు.

జిల్లాలో అత్యధికంగా రెవెన్యూ విభాగంలో 377 అర్జీలు వచ్చాయి. మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ విభాగానికి 248, పంచాయతీరాజ్‌కి 206, సర్వే సెటిల్‌మెంట్ ల్యాండ్ రికార్డ్స్‌కి 95, ఈపీడీసీఎల్‌కి 68, పోలీసు విభాగానికి 50, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు 43, హౌసింగ్ కార్పొరేషన్‌కు 36అర్జీలు వచ్చాయి. వాటర్‌రిసోర్స్‌కు 27, ఫ్యామిలీ వెల్ఫేర్‌కు 27, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగానికి 26, సోషల్ వెల్ఫేర్‌కు 22, వ్యవసాయానికి సంబంధించి 20 అర్జీలు స్వీకరించారు. విద్యాశాఖలో 19, మత్స్యశాఖలో 18, కాలుష్యనియంత్రణకు సంబంధించి 17, రూరల్ వాటర్ సప్లయిలో 17, చైల్డ్‌వెల్ఫేర్‌లో 16, ఏపీఎస్ఆర్టీసీలో 16, గ్రామీణాభివృద్ధి విభాగానికి 15, వైద్య విద్యలో 15, ఆర్అండ్‌బీలో 14 అర్జీలు వచ్చాయి. సివిల్ సప్లయిస్‌లో 14, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్‌లో 10, దేవదాయ శాఖకు సంబంధించి 7 అర్జీలు వచ్చాయి. ఇలా అన్ని విభాగాల్లో అధికారులు అర్జీలను స్వీకరించారు. కొన్నింటి పరిష్కారానికి రోజుల వ్యవధి గడువుగా ప్రభుత్వం నిర్ణయించగా మరికొన్నింటి పరిష్కారానికి 15 నుంచి 60 రోజుల సమయాన్ని ప్రభుత్వం గడువు ప్రకటించింది.

విధి విధానాల కోసం ఎదురుచూపు

పింఛన్లకోసం దరఖాస్తు చేసుకున్న అర్జీలను పరిష్కరించాలంటే రాష్ట్రప్రభుత్వం నుంచి నూతన విధి విధానాలు రావాల్సి ఉందని అధికారులు చెప్తున్నారు. ఇళ్లస్థలాల మంజూరుపైనా అంతే. గత ప్రభుత్వం ఇచ్చిన స్థలాల్లో గృహనిర్మాణాలు చేపట్టాలంటే కొత్త ప్రభుత్వం నిధులు విడుదల చేయాలి. అప్పటివరకు ఈ దరఖాస్తులు పెండింగ్‌లోనే ఉండనున్నాయి.

5న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ

కలెక్టరేట్(కాకినాడ), ఆగస్టు 3: జిల్లాస్థాయిలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజాఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ఈనెల 5న కాకినాడ కలెక్టరేట్‌లో యథాతథంగా జరుగుతుందని కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన వెలువరించారు. రెవెన్యూడివిజన్, మండలస్థాయిలో అన్నిమండలాల్లో నిర్వహిస్తున్నామన్నారు. పిఠాపురంలో జరిగే కార్యక్రమం రద్దు చేశామన్నారు.

అర్జీలను గడువులోపు పరిష్కరించాలి: కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), ఆగస్టు 3: మండల, మున్సిపల్ కార్యాలయాలకు వివిధ సమస్యలపై అందిన దరఖాస్తులపై వెంటనే స్పందించి, గడువులోపు పరిష్కరించాలని కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశించారు. కాకినాడ కలెక్టరేట్‌లో అన్ని మండలాల ఎంపీడీవోలు మున్సిపాలిటి కమిషనర్లతో మండల, మున్సిపాలిటీ వారిగా అందిన దరఖాస్తులపై అధికారులు పరిష్కారానికి తీసుకున్న చర్యలపై శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం ప్రజాసమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. ఈనేపథ్యంలో మండల, మున్సిపాలిటీ పరిధిలో ప్రతిసోమవారం నిర్వహిస్తున్నప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో అందిన అర్జీలపై వెందనే స్పందించి, తప్పనిసరిగా గడువులోపు పరిష్కరించాలన్నారు. డ్రైనేజీ, మురికికాలువల్లో పూడికలు తీయించడం, పారిశుధ్య కార్యక్రమాలు సక్రమంగా నిర్వహించడంపైన దృష్టి పెట్టాలన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి తిప్పేనాయక్, సీపీవో త్రినాథ్, డీఆర్డీఏ పీడీ శ్రీరమణి, హౌసింగ్ పీడీ సత్యనారాయణ, డీపీవో భారతిసౌజన్య పాల్గొన్నారు.

అక్టోబరు నాటికి 4,400 ఇళ్ల నిర్మాణం పూర్తి

- 100 రోజుల ప్రణాళికతో కార్యాచరణ
- హౌసింగ్ పీడీ సత్యనారాయణ

కార్పొరేషన్(కాకినాడ), ఆగస్టు 3: హౌసింగ్ డిపార్ట్‌మెంట్ ద్వారా ఈ అక్టోబర్ నాటికి 4,400 ఇళ్లు పూర్తిచేసేందుకు వందరోజుల ప్రణాళికతో కార్యాచరణ రూపొందించామని హౌసింగ్ పీడీ సత్యనారాయణ తెలిపారు. శనివారం ఆయన ఈఈలు, డీఈఈలు, ఏఈలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది అక్టోబరు నాటికి 4,400 ఇళ్లను పూర్తి చేయడానికి వంద రోజుల కార్యాచరణ ప్రణాళికను పూర్తిస్థాయిలో అమలు చేయాలన్నారు. నీటి సరఫరా, అప్రోచ్‌రోడ్లు, అంతర్గత రోడ్లు, విద్యుద్దీకరణ మొదలైన కనీస మౌలిక సదుపాయాల కోసం ప్రణాళికలు రూపొందించి సమర్పించాలన్నారు. ఇల్లు నిర్మించుకునేందుకు ఎస్‌హెచ్‌జీ రుణాలు అందించేందుకు తగిన ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. సమావేశంలో ఇంజనీర్లు వై.శ్రీనివాస్, కేవీఆర్ గుప్తా, డి.గాయత్రిరామ్ పాల్గొన్నారు.

ఉద్యానశాఖకు పుష్కలంగా నిధులు

- రూ.4కోట్ల 35లక్షలు విడుదల

కలెక్టరేట్(కాకినాడ), ఆగస్టు 3: జిల్లాలో ఉద్యాన శాఖ ద్వారా అభివృద్ధి పథకాలకు రూ.4కోట్ల35లక్షలు విడుదల చేసినట్లు కాకినాడ జిల్లా ఉద్యాన అధికారి మల్లిఖార్జునరావు వెల్లడించారు. జిల్లా కలెక్టర్ ఉత్తర్వుల మేరకు నిధులు విడుదలయ్యాయని ఆయన చెప్పారు. ఉద్యానశాఖలో రైతులకు చెల్లించాల్సిన బకాయిలను కూడా వీటిద్వారా జమ చేస్తున్నామన్నారు. దీనిలో రాష్ట్రీయ కృషి వికాస యోజన కింద రూ.68,18,400, ఉద్యాన సమగ్ర అభివృద్ధి మిషన్ కింద రూ.16,50,000, తినే నూనెల జాతీయ మిషన్ పథకం కింద రూ.3,51,16,897 విడుదల చేస్తున్నామన్నారు. మొత్తంగా మూడు పథకాలు కింద రూ.4,35,85,295 విడుదల అయ్యిందన్నారు. కొత్తగా వేసిన మామిడి, జీడిమామిడి, జామ, బొప్పాయి రైతులకు విస్తరణ పథకం కింద రూ.7,11,737 జమ చేశామన్నారు. టమోటా, దొండ, బీర, గుమ్మడి పంటలకు సంబంధించిన రైతులు బ్యాంకు ఖాతాల్లో హైబ్రిడ్ కూరగాయల సాగు పథకం కింద రూ.2,20,920 జమ చేశామన్నారు. 2022-23లో వేసిన ఆయిల్‌పాం తోటల రైతులకు నిర్వహణ పథకం కింద రూ.23,36,227 జమ చేశామన్నారు. ఇలా వివిధ పథకాల కింద ఉద్యానశాఖ రైతుల ఖాతాలల్లో సొమ్ము జమ చేస్తున్నామన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఈపీడీసీఎల్ ఎస్ఈ

కలెక్టరేట్(కాకినాడ), ఆగస్టు 3: సాధారణ బదిలీలో భాగంగా విశాఖ ఏపీఈపీడీసీఎల్‌లో ఎస్ఈ కె.తిలక్‌కుమార్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎస్ఈగా బదిలీ అయ్యి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కాకినాడ కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ షణ్మోహన్, జిల్లా డీఆర్‌వో తిప్పేనాయక్‌లను శనివారం ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు.

8న వ్యక్తిగతంగా హాజరుకావాలని పీఆర్ కళాశాల ప్రిన్సిపాల్‌కు హైకోర్టు ఆదేశం

కాకినాడ రూరల్, ఆగస్టు 3: కోర్టు ఉత్తర్వులు ఉన్నప్పటికీ ఓ విద్యార్థినికి ప్రాక్టికల్ పరీక్షకు అనుమతించని ఘటనలో కాకినాడ పీఆర్ కళాశాల ప్రిన్సిపాల్ ఈనెల 8న వ్యక్తిగతంగా హైకోర్టుకు హాజరుకావాలని ఆదేశాలు జారీఅయ్యాయి. కాకినాడ పీఆర్ ప్రభుత్వ అటానమస్ డిగ్రీ కళాశాలలో కేఆర్ ఎంఎస్ సాయిమేఘన అనే విద్యార్థిని బయోటెక్నాలజీ కోర్సు చివరి సంవత్సరం చదువుతోంది. డిగ్రీ ఆఖరి సంవత్సరంలో జూలై 2న బయోటెక్నాలజీ థియరీ పరీక్షలకు అనుమతి ఇచ్చి ప్రాక్టికల్‌కు తనకు అనుమతి ఇవ్వకపోవడంపై ఆమె హైకోర్టులో పిటీషన్ దాఖలు చేసింది. ఆమెను ప్రాక్టికల్ పరీక్షలకు అనుమతించాలని గతనెలలో హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. కానీ కళాశాల ప్రిన్సిపాల్ బీవీ తిరుపాణ్యం ఈ విషయాన్ని ప్రిన్సిపాల్ లెక్క చేయకపోవడంతో మళ్లీ ఆమె హైకోర్టును సంప్రదించింది. దీంతో ఈనెల 8న హైకోర్టుకు వ్యక్తిగతంగా హాజరుకావాలని ప్రిన్సిపాల్‌ను ఆదేశిస్తూ శనివారం ఉత్తర్వులు జారీఅయ్యాయి. విద్యార్థి తరఫున కాకినాడకు చెందిన ప్రముఖ న్యాయవాది మతుకుమిల్లి శ్రీవిజయ్ విద్యార్థిని తరఫున కోర్టులో కేసును వాదించారు.



కలెక్టర్‌కు ఫిర్యాదు అందజేస్తున్న ఎమ్మెల్యే వనమాడి

ద్వారంపూడి రూ.600కోట్ల దోపిడీపై విచారణ జరిపించాలి

- కాకినాడ సిటీ ఎమ్మెల్యే కొండబాబు



(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

ముందడుగు!

మద్యం పాలసీపై కూటమి కసరత్తు

- త్వరలోనే నాణ్యమైన కిక్కు
- అక్టోబరు నుంచి కొత్త పాలసీ!
- పాత పద్ధతిలో అమలు యోచన
- ప్రైవేటు షాపులు.. అన్ని బ్రాండ్లూ
- జగన్ పిచ్చి బ్రాండ్లు ఖతం
- పక్కరాష్ట్రాల పాలసీపై అధ్యయనం
- ఈ నెల 12 లోపు నివేదికకు ఆదేశం

గొంతులో నాణ్యమైన చుక్కపడి ఐదేళ్లయ్యింది. ధరలతో జేబుకు పెద్ద చిల్లు పడింది. కొత్త ప్రభుత్వం కొలువు దీరిన తర్వాత మందుబాబులు అందుబాటు ధరలో నాణ్యమైన కిక్కు కోసం ఎదురు చూస్తున్నారు. అయితే ఐదేళ్లపాటు పిచ్చి బ్రాండ్లతో ఇల్లు, ఒళ్లు గుల్ల చేసుకున్న మందుబాబులకు కూటమి ప్రభుత్వం త్వరలోనే నాణ్యమైన కిక్కు ఇవ్వనుంది. మళ్లీ 2019కి ముందు రోజులు మందు బాబులు చూడనున్నారు. ప్రాణాలు మింగేస్తున్న జగన్ పిచ్చి బ్రాండ్లను తీసేసి గతంలో టీడీపీ హయాంలో మాదిరిగా నాణ్యమైన సరుకు తీసుకొస్తామని ఎన్నికల ప్రచారంలో సీఎం చంద్రబాబు ప్రకటించిన హామీ అమలుకు ఇప్పటికే కసరత్తు మొదలైంది. ప్రక్రియ అంతా సజావుగా పూర్తయితే అక్టోబరు నుంచి కొత్త మద్యం పాలసీ తీసుకొచ్చే అవకాశం కనిపిస్తోంది.

వైసీపీలో అంతా దోపిడీనే..

గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లూ దారుణమైన మద్యం పాలసీని అమలు చేసిన విషయం తెలిసిందే. జగన్ దెబ్బకు అంతర్జాతీయ కంపెనీలు రాష్ట్రం నుంచి పరుగు పెట్టాయి. మద్యం తయారీ కేంద్రాలను(బ్రేవరీలు) వైసీపీ నాయకులు బలవంతంగా సొంతం చేసుకొని రోజుకో బ్రాండును జనాల్లోకి తెచ్చారు. పెద్ద కంపెనీలు జగన్‌కి భయపడి రాష్ట్రంలో అమ్మకాలనే మానేశాయి. ఎంసీ, నాకవుట్ బ్రాండ్ల పేరు విని ఐదేళ్లు గడిచిపోయింది. ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. ఇష్టానుసారం ధరలు నిర్ణయించుకోవచ్చని వైసీపీ ప్రభుత్వం జీవో ఇవ్వడంతో బార్లలో ఒక్కో బీరుపై ఎంఆర్పీపై రూ.100 -150, క్వార్టరుపై రూ.70 వరకూ అదనంగా లాగేస్తున్నారు. వైసీపీ హయాంలో మిగతా రాష్ట్రాలతో పోలిస్తే మన దగ్గర ఎంఆర్పీ ఎక్కువగా ఉండేది.

అప్పటి టీడీపీ ప్రభుత్వంలో ఇలా..

2019కి ముందు టీడీపీ ప్రభుత్వంలో మద్యం పాలసీ ఓ పద్ధతిగా ఉండేది. అప్పుడు క్వార్టరు(180ఎంఎల్) నాణ్యమైన సరుకు రూ.120కే దొరికేది.వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఆ ధరను అమాంతం రూ.200 చేసేశారు. 'జే' బ్రాండ్లతో షాపులను నింపేశారు. అమ్మకాలు ఎక్కువగా ఉన్న బ్రాండ్లకు మళ్లీ క్వార్టరుకు రూ.20.. తర్వాత రూ.10 అదనంగా తగిలించారు. ఇలా క్వార్టరు రూ.230 అయిపోయింది. సారా వల్ల ఆరోగ్యాలకు ఇబ్బంది కలుగుతోందని గ్రహించిన టీడీపీ పాలకులు చీప్ లిక్కర్‌ని అందుబాటులోకి తెచ్చారు.ఈ మందు ప్రమాణాల ప్రకారం డిస్టలరీల్లో తయారయ్యేది.అయినా దాని ధర మాత్రం రూ.60 మించలేదు. వైసీపీ ప్రభుత్వంలో రంగు సారా సీసాల్లో నింపి ధర రూ.150-180 చేశారు. టీడీపీ ప్రభుత్వంలో లైసెన్సు పొందిన మందు షాపులు ఉండేవి. ఎంఆర్పీపై ఒక్క రూపాయి కూడా అధికంగా వినియోగదారుల వద్ద నుంచి తీసుకోకుండా ప్రభుత్వమే వ్యాపారస్తులకు కమిషన్ ఇచ్చేది. వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఆ విధానాన్ని తీసేసింది. అసలే ఎంఆర్పీ అధికమంటే దానిపై ఎంత ఎక్కువకైనా అమ్ముకోవచ్చంటూ బార్‌లకు ధరలను ధారాదత్తం చేస్తూ ఆదేశాలు ఇచ్చేసింది. దీంతో టీడీపీ ప్రభుత్వంలో రూ.60కి దొరికే చీప్ లిక్కర్ ఇప్పుడు బార్‌లో కొనాలంటే రూ.210 అవుతోంది. రోజంతా కష్టపడితే రూ.500 వస్తే గతంలో సుమారు రూ.400 ఇంటికి తీసుకెళ్లేవారు. వైసీపీ మద్యం పాలసీ వల్ల రూ.100 కూడా కొంపకు చేర్చడం కష్టమయ్యేది. దీంతో కుటుంబాలు ఆర్థికంగా చితికిపోయాయి.

పిచ్చిబ్రాండ్లపై విజిలెన్స్

జగన్ ప్రభుత్వంలో నాసిరకం మద్యానికి చాలా మంది బలైపోయారు. లివర్, గుండె, ఉదర సంబంధిత, మతిమరుపు వ్యాధులు ఎక్కువయ్యాయి. వైసీపీ నాయకులు ఇష్టానుసారం మద్యాన్ని తయారు చేసేవారు. సాధారణంగా పెద్ద కంపెనీలు వారి సొంత ఫార్ములా ప్రకారం మద్యం తయారు చేస్తాయి. వైసీపీ నాయకులు అవేమీ పట్టించుకోకుండా కల్తీ మద్యాన్ని తాగించారు. గడిచిన ఐదేళ్లలో జిల్లాలో మద్యం వల్ల అప్పటికే ఉన్న వ్యాధులు వేగంగా తీవ్రమై సుమారు 8 వేల మంది వరకూ మరణించారని తెలుస్తోంది. వీరిలో 600 మంది వరకూ నాసిరకం మద్యం తాగడం వల్ల ప్రాణాలు కోల్పోయిన వారు ఉన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత జగన్ పిచ్చి బ్రాండ్ల నిగ్గుతేల్చే పని ఆరంభించింది. దీనిలో భాగంగా ఈ నెల 21న జిల్లాలోని మూడు మద్యం తయారీ కేంద్రాల్లో విజిలెన్స్ అధికారులు సోదాలు చేశారు. కొప్పవరంలోని బీడీహెచ్ ఆగ్రో వెంచర్స్ లిమిటెడ్ నుంచి 193, నల్లమిల్లిలోని ఫ్రాగ్ డిస్టిలరీస్ నుంచి 240, కోటపాడులోని పీఎంకే డిస్టిలరీస్‌లో 829 మద్యం నమూనాలను సేకరించింది. నిబంధనలు పాటించలేదని ప్రాథమికంగా అంచనా వేస్తూ మూడు కేసులు నమోదు చేశారు.ఆయా డిస్టిలరీల్లో తీసుకున్న నమూనాలను రీజనల్ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ (ఆర్ఎఫ్ ఎస్ఎల్)కి పంపించారు. ప్రజల ఆరోగ్యానికి, ప్రాణాలకు హాని కలిగించే కారకాల ఆచూకీపై లోతుగా విశ్లేషణ చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం పిచ్చి బ్రాండ్లను పూర్తిగా నిర్మూలించి నాణ్యమైన మద్యాన్ని అందుబాటు ధరల్లో ఇవ్వడానికి సన్నాహాలు చేస్తోంది.వైసీపీ ప్రభుత్వ మద్యం పాలసీ ప్రకారం ప్రభుత్వ మద్యం దుకాణాల లైసెన్సులు సెప్టెంబరు వరకూ ఉన్నాయి. ఈలోపు మార్చడం కుదరదు. బార్ల లైసెన్సు ఇంకా ఏడాది ఉంది.ఇవన్నీ పరిగణనలోకి తీసుకొని న్యాయపరమైన చిక్కులు రాకుండా కొత్త మద్యం పాలసీ తీసుకొచ్చే యోచన లో కూటమి పాలకులు ఉన్నారు.ఇప్పటికే ఎంసీ, సియా గ్రా మ్స్ వంటి కంపెనీలతో ఒప్పందాలకు ప్రయత్నాలు చేస్తు న్నట్టు చెబుతున్నారు.దీంతో ఐబీ, ఎంసీ బ్రాందీ వంటి సుమా రు 30 రకాల బ్రాండ్లు అందుబాటులోకి రానున్నాయి. జగన్‌కి భయపడి కనుమరుగైన నాకవుట్,బడ్వైజర్ వంటి బీర్లను మళ్లీ మందుబాబులకు అందుబాటులోకి వచ్చే అవకాశం కనిపిస్తోంది.

కూటమి కొత్త పాలసీ

కూటమి ప్రభుత్వం కొత్త మద్యం పాలసీని తీసుకొచ్చే కసరత్తు మొదలు పెట్టింది.దీనిలో భాగంగా మద్యం పాలసీపై అధ్యయనానికి రాజస్థాన్, యూపీ, తెలంగాణ, కేరళ, తమిళనా డు, కర్నాటక రాష్ట్రాలకు ఉన్నతాధికారుల బృందాన్ని పంపిం చాలని నిర్ణయించింది. అక్కడి బార్లు, మద్యం ధరలు, కొను గోళ్లు, నాణ్యత, చెల్లింపుల విధానం, ఆన్‌లైన్ పేమెంట్లు తదితర అంశాలపై ఈ నెల 12లోగా నివేదిక ఇవ్వాలని ఆదేశించింది.దీని ప్రకారం సీఎం చంద్రబాబు నిర్ణయం తీసు కోనున్నారు. కొత్త మద్యం పాలసీ 2019కి ముందు ఉన్నట్లు రాబోతోందనే చర్చ నడుస్తోంది. దీంతో ధరలు కూడా తగ్గే అవకాశం ఉందని చెబుతున్నారు. అప్పట్లో ఎక్సైజ్ డిపార్ట్ మెంట్ తనిఖీలు చేసి తగు చర్యలు తీసుకునేది. జగన్ వచ్చిన తర్వాత సెబ్ అంటూ కొత్త డిపార్ట్‌మెంట్‌ని సృష్టించి గజిబిజి చేసేశారు. ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్‌కి కోరలు పీకి కూర్చోబెట్టారు.



రేపటి నుంచి సత్యదేవుడి 134వ ఆవిర్భావ దినోత్సవాలు

అన్నవరం, ఆగస్టు 3: రత్నగిరివాసుడైన సత్యదేవుడికి క్రోధి నామసంవత్సర ఆవిర్భావ దినోత్సవాలు ఈనెల 5 నుంచి ప్రారంభమై రెండురోజులపాటు నిర్వహించనున్నారు. సత్యదేవుడు రత్నగిరికొండపై 1891 ఖరనామ సంవత్సరం శ్రావణశుద్ధ విదియ రోజున స్వామివారి ఆవిర్భవించినట్టు ఆలయ చరిత్ర ద్వారా తెలుస్తోంది. అప్పట్నించి ఏటా శ్రావణ శుద్ధ విదియరోజున ఆవిర్భావ దినోత్సవం జరపడం ఆనవాయితీ. దీనిలోభాగంగా 5వ తేదీ ఉదయం 8 గంటలకు గణపతిపూజ, పుణ్యాహవచనం, మంటపారాధన, కలశస్థాపన, దీక్షావస్త్ర ధారణలు చేపట్టి 6వ తేదీ వేకువజామున మూలవరులకు పంచామృతాభిషేకం, ఇతర పూజాధికాలు, పండిత సత్కారాలు జరగనున్నాయి. 11 గంటలకు జరిగే ఆయుష్యహోమ పూర్ణాహుతితో వేడుకలు ముగుస్తాయి. 6న అనంతలక్ష్మి అమ్మవారికి వజ్రకిరీటాన్ని సమర్పించనున్నట్టు పీఆర్వో కృష్ణారావు తెలిపారు.

7న ఉదయం నుంచి భీమేశ్వరస్వామివారి దర్శనం

ద్రాక్షారామ, ఆగస్టు3: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో పురావస్తుశాఖ చేపట్టిన మూలవిరాట్ సంరక్షణ, అభివృద్ధి పనులు పూర్తికావడంతో ఈనెల 7న ఉదయం 11.05 గంటల నుంచి భీమేశ్వరస్వామివారి, మాణిక్యాంబ అమ్మవార్ల దర్శనానికి భక్తులను అనుమతించనున్నట్టు ఈవో పి.టి.వి.సత్యనారాయణ శనివారం తెలిపారు. 5న ఉదయం 8.05 గంటలకు సంకల్పం, అనంతరం పాడ్యమి మొదలు తదియ వరకు త్రయాహ్నిక దీక్షగా శ్రావణ శుద్ధ 7వ తేదీ ఉదయం 9.34 గంటల వరకు కళావాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. పూజాధికాల అనంతరం ఉదయం 11.05 నుంచి భక్తులకు దర్శనం కల్పిస్తామన్నారు.

బాలబాలాజీ స్వామికి విశేష పూజలు

మామిడికుదురు, ఆగస్టు3: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం అప్పనపల్లి బాలబాలాజీస్వామికి శనివారం భక్తులు విశేష పూజలు నిర్వహించారు. స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో సర్వాంగా సుందరంగా అలంకరించారు. శనివారం ఆర్జిత సేవల ద్వారా రూ.1,22,817 ఆదాయం సమకూరిందని, స్వామివారిని 1,694 మంది దర్శించుకోగా, 1,205 మంది అన్నప్రసాదం స్వీకరించారని సహాయ కమిషనర్ జి.మాధవి తెలిపారు. నిత్యాన్నదాన పథకానికి పశ్చిమగోదావరి జిల్లా గునుపూడికి చెందిన కుందుర్తి సింహాచలం దంపతులు రూ.10,700 విరాళంగా అందించారు. దాత దంపతులకు స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందించి అభినందించారు.

భీమేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.9.19 లక్షలు

ద్రాక్షారామ, ఆగస్టు3: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం ద్రాక్షారామ భీమేశ్వరస్వామికి హుండీ ద్వారా రూ.9,19,057 ఆదాయం లభించింది. అన్నదాన ట్రస్టు హుండీ ద్వారా రూ.1,22,753 ఆదాయం సమకూరింది. శనివారం దేవాదాయశాఖ తనిఖీదారు బాలాజీ రామ్‌ప్రసాద్ పర్యవేక్షణలో ఈవో పి.టి.వి.సత్యనారాయణ ఆధ్వర్యంలో సిబ్బంది హుండీలను తెరచి కానుకలను లెక్కించారు. ఆళ్ల బుజ్జి, పెంకే సాయితేజ్, కలిదిండి వినాయకుడు, కర్రినాగేశ్వరరావు, అల్లం రామకృష్ణ, అర్చకులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ బాక్సింగ్ పోటీల్లో పతకాలు

మామిడికుదురు, ఆగస్టు 3: భూటాన్‌లో జరిగిన అంతర్జాతీయ బాక్సింగ్ పోటీల్లో పలువురు విద్యార్థులు పతకాలు సాధించారని అంతర్జాతీయ కోచ్ చిట్టూరి చంద్రశేఖర్ తెలిపారు. నింజా స్పోర్ట్స్ ఆధ్వర్యంలో జూలై 26 నుంచి 28 వరకు జరిగిన బాక్సింగ్ పోటీల్లో జి.పావనిసాయిమహ (గెద్దాడ), ఎం.ప్రసీద (గూడపల్లి), సీహెచ్ అఖిల్ (మానేపల్లి), ఎస్కే నజ్రీన్ (రాజమహేంద్రవరం), వందన (అనంతపురం), ముఖేష్‌సాయియాదవ్ (తిరుపతి) బంగారు పతకాలు, అంతర్వేదిపాలేనికి చెందిన వై.దివ్యవాణి రజత పతకం సాధించినట్టు కోచ్ తెలిపారు. పతకాలు సాధించిన విజేతలను పలువురు అభినందించారు.



పాదగయలో పూజలు నిర్వహిస్తున్న కొణిదెల నిహారిక.. ఈవో, 'కమిటీ కుర్రాళ్లు' సినిమా యూనిట్ సభ్యులు

పాదగయలో మెగా హీరోయిన్ నిహారిక పూజలు

పిఠాపురం, ఆగస్టు3: పిఠాపురంలోని పాదగయ క్షేత్రాన్ని మెగా హీరోయిన్, జనసేన ప్రధాన కార్యదర్శి నాగబాబు కుమార్తె కొణిదెల నిహారిక సందర్శించారు. నిహారిక ప్రొడక్షన్స్ ఆధ్వర్యంలో నిర్మితమైన 'కమిటీ కుర్రాళ్లు' సినిమా ఆగస్టు 9న విడుదల కానున్న నేపథ్యంలో మూవీ యూనిట్‌తో కలిసి ఆమె పాదగయలోని కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయ స్వామి, రాజరాజేశ్వరీదేవి, పురుహూతికాఅమ్మవార్లను దర్శించుకుని పూజలు నిర్వహించారు. క్షేత్రప్రాశస్త్యం గురించి వేదపండితులు వివరించారు. ఆలయ ఈవో అల్లు వెంకట దుర్గాభవానీ నిహారిక తదితరులకు స్వామి, అమ్మవారి ఫొటో, ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆమె గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని డిప్యూటీ సీఎం పవన్ నివాసానికి వెళ్లారు.

వరల్డ్ క్లాస్ స్థాయిలో రాజమండ్రి రైల్వే స్టేషన్



డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్‌తో పురందేశ్వరి, గోరంట్ల, నల్లమిల్లి

- రాజమండ్రి ఎంపీ పురందేశ్వరి

రాజమహేంద్రవరం, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): వరల్డ్ క్లాస్ స్థాయిలో రాజమండ్రి రైల్వే స్టేషన్‌ని తీర్చిదిద్దడానికి ప్రయత్నం చేస్తున్నామని ఎంపీ పురందేశ్వరి పేర్కొన్నారు. రైల్వే స్టేషన్‌ని దాదాపు రూ.270 కోట్లతో అమృత్ భారత్ పథకంలో అభివృద్ధిచేయనున్న సంగతి తెలిసిందే. అయితే ప్రజల ఆకాంక్షలు, భవిష్యత్ అవసరాల మేరకు ప్లాన్‌లో కొన్ని మార్పులు చేయాల్సిన అవసరం ఉందని కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌ని పురందేశ్వరి ఢిల్లీలో కలిసి వివరించారు. మార్పులపై స్పష్టమైన నివేదిక కోసం తమ అధికారులతో కలిసి రాజమండ్రి రైల్వే స్టేషను పరిశీలించాలని ఆయన సూచించారు. దాంతో వెంటనే పురందేశ్వరి శనివారం రాజమండ్రి చేరుకున్నారు. అమృత్ భారత్ స్కీం పనులను గతిశక్తి(రైల్వే బోర్డు) విభాగం చూస్తుండడంతో ఆ అధికారులు, విజయవాడ డివిజన్ అధికారులు కూడా హుటాహుటిన రాజమండ్రి చేరుకున్నారు. ముందుగా ప్లాన్‌ని పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా స్థానికంగా ఓ ప్రైవేటు హోటల్‌లో జరిగిన ప్రత్యేక సమావేశంలో రైల్వే ఉన్నతాధికారులు ఎంపీకి వివరించారు. ప్రస్తుత ప్లాన్‌లో రైల్వే పశ్చిమ వైపు ప్రధాన ద్వారం, ఐదు అంతస్తులు అధునాతన సదుపాయాలతో భవనం.. పశ్చిమ వైపు రెండు అంతస్తులతో భవనం నిర్మించాలని అనుకొంది. అయితే.. తూర్పు వైపు నగరం వేగంగా అభివృద్ధి చెందుతుండడం, 100 అడుగుల రోడ్డు రానుండడం వంటి వాటివల్ల ప్రధాన అభివృద్ధిని అటువైపునకు మార్చాలని ఎంపీ సూచించారు. తూర్పు వైపు నుంచి 1, 2, 3, 4, 5 ప్లాట్‌ఫాంలు వచ్చేలా మార్పు చేయాలని కోరారని తెలుస్తోంది. తర్వాత ఆమె రైల్వే స్టేషన్‌ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ రానున్న 50 ఏళ్లను దృష్టిలో ఉంచుకొని రైల్వే స్టేషన్‌ని అభివృద్ధి చేస్తామన్నారు. కొవ్వూరు, అనపర్తి స్టేషన్లలో మరికొన్ని రైళ్లను నిలపాలని కోరామన్నారు. వాటితోపాటు 2027 పుష్కరాల నాటికి పనులు పూర్తి చేయాలని కోరగా మంత్రి అశ్వినీ వైష్ణవ్ సానుకూలంగా స్పందించారని, ఆయనకు ధన్యవాదాలు తెలుపుతున్నామని పురందేశ్వరి అన్నారు. ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి మాట్లాడుతూ తూర్పు రైల్వేస్టేషను రోడ్డు విస్తరణ చేయాలని నిర్ణయించామన్నారు. రైల్వే, మునిసిపల్ కార్పొరేషన్ సమన్వయంతో అభివృద్ధి చేస్తామన్నారు. హేవలాక్ వంతెనను పర్యాటకపరంగా తీర్చిదిద్దడానికి చర్యలు చేపట్టామని వివరించారు. ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ముడిసరుకుల దిగుమతులను దృష్టిలో ఉంచుకొని బిక్కవోలు రైల్వేస్టేషన్‌ను అభివృద్ధి చేయాలని కోరగా రైల్వే అధికారులు సానుకూలంగా స్పందించారన్నారు. కేశవరం దగ్గర ఆర్‌వోబీ ఏర్పాటు చేయాలని చెప్పగా భూసేకరణకు కృషి చేస్తామన్నారన్నారు. ఎంపీ, ఎమ్మెల్యేల సూచనలను క్రోడీకరించి ఒక నివేదిక తయారు చేస్తామని డీఆర్ఎం నరేంద్ర ఎ.పాటిల్ పేర్కొన్నారు. ఆ మేరకు రాజమండ్రి రైల్వేస్టేషను అభివృద్ధి పనులు మొదలు పెడతామని చెప్పారు. రోడ్ కం రైలు బ్రిడ్జిపై భారీ వాహనాలు నిషేధమని ఇప్పటికే అధికారులకు చెప్పామని ఆయన వెల్లడించారు. అనంతరం పురందేశ్వరి ఢిల్లీ వెళ్లారు. ఎస్ఎంఆర్ రంగనాథ్, డీఈఈ (మెము కార్‌షెడ్) ప్రసాద్, సీటీఐ చంద్రమౌళి, సీసీఐ కల్యాణ్, ఎస్ఎస్ఈ(వర్క్స్) వల్లి, విజయవాడ డివిజనల్ అధికారులు, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



వాడపల్లి స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.37.98 లక్షలు

ఆత్రేయపురం, ఆగస్టు 3: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తజనం పోటెత్తారు. వేకువజామునే స్వామి వారికి సుప్రభాతసేవ, నీరాజన మంత్రపుష్పం, ఐశ్వర్యలక్ష్మి హోమం, బాలభోగం తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించి స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారి తిరు వీధులలో ఏడు ప్రదక్షిణలు నిర్వహించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భారీ క్యూలైన్ల ద్వారా స్వామిని దర్శించుకున్న భక్తులు తులాభారాలు, కానుకలు సమర్పించుకుని స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు. రాత్రి వేళ వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. వివిధ సేవల ద్వారా స్వామి ఒక్కరోజు ఆదాయం రూ.37.98 లక్షలు లభించినట్టు డిప్యూటీ కమిషనర్, ఈవో భూపతిరాజు కిశోర్‌కుమార్ తెలిపారు.



ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న తలుపులమ్మ అమ్మవారు

లోవ క్షేత్రంలో వైభవంగా ఆషాఢ మాసోత్సవాలు

నేడు ఉదయం అమ్మవారికి నదీజలాలతో జలాభిషేకం

తునిరూరల్, ఆగస్టు 3: ప్రసిద్ధి పుణ్యక్షేత్రం లోవలో ఆషాఢ మాసోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. అమ్మవారికి ప్రీతికరమైన రోజులు కావడంతో విశేష పూజలతోపాటు వైదిక కార్యక్రమాలు శాస్త్రోక్తంగా జరుగుతున్నాయి. ఆషాఢమాసంలో అమావాస్యకు ముందు ఏటా నిర్వహించే ప్రత్యేక పూజలు లోవ క్షేత్రంలో ప్రారంభమయ్యాయి. శనివారం తొలుత గణపతి పూజ, పుణ్యాహవచనం పూజలు నిర్వహించిన పండితులు ఆదివారం ఉదయం అమ్మవారికి సప్తనదీ జలాలతో అభిషేకించేందుకు ఏర్పాటు జరుగుతున్నాయని ఆలయ పండితులు రాణి శర్మ తెలిపారు. ఈ జలాభిషేక పూజల్లో భక్తులను భాగస్వామ్యం చేసే దిశగా ఏర్పాట్లు చేశామని, ఆదివారం జరిగే ఈ పూజలకు పెద్దఎత్తున భక్తులు తరలివస్తారని తెలిపారు.



జ్యోతి ప్రజ్వలన చేసి ఐఎంఏ కాన్ఫరెన్స్ ప్రారంభిస్తున్న మంత్రి దుర్గేష్

వైద్య రంగంలో ఆధునిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి

ఐఎంఏ సదస్సులో మంత్రి దుర్గేష్

రాజానగరం, ఆగస్టు 3: వైద్యరంగంలో సంతరించుకుంటున్న ఆధునిక పరిజ్ఞానాన్ని నేటి వైద్యులు అందిపుచ్చుకోవాలని రాష్ట్ర టూరిజం, సాంస్కృతిక వ్యవహారాలశాఖ మంత్రి కందుల దుర్గేష్ ఆకాంక్షించారు. రాజానగరం సమీపంలోని జీఎస్ఎల్ మెడికల్ కళాశాలలో నిర్వహించిన ఇండియన్ మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఐఎంఏ)ఆధ్వర్యంలో రెండు రోజులపాటు జరుగుతున్న సౌత్ జోన్ వైద్య విజ్ఞాన సదస్సును శనివారం జ్యోతి ప్రజ్వలనచేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నేటి సమాజంలో వైద్య వృత్తిలో వస్తున్న నైపుణ్యాలను ఎప్పటికప్పుడు ఆకళింపు చేసుకుంటే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించగలరన్నారు. సభాధ్యక్షుడు, ఐఎంఏ ఆంధ్రప్రదేశ్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎంజేసీ నాయుడు మాట్లాడుతూ ఏపీ శాసనమండలిలో వైద్యులకు ప్రాతినిధ్యం కల్పించే దిశగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని మంత్రికి విన్నవించారు. అలాగే డాక్టర్లపై ఒత్తిడి పెంచేలా రూపుదిద్దుకున్న 2008 సంవత్సరంలో రూపుదిద్దుకున్న 11వ చట్టంలో సవరణలు, క్లినిక్స్ నర్సింగ్ హోమ్ రిజిస్ట్రేషన్లకు సింగిల్ విండో ఏర్పాటు అవసరమని మంత్రికి విన్నవించారు. దీనిపై మంత్రి మాట్లాడుతూ వైద్యంరంగం తరపున కనీసం ఒక వైద్యునికైనా ఎమ్మెల్సీ అవకాశం కల్పించేలా ప్రభుత్వాన్ని కోరనున్నామని బదులిచ్చారు. ఈ సదస్సులో ఆంధ్రప్రదేశ్ సహా తెలంగాణ, కర్నాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాలకు చెందిన 500మందికి పైగా జనరల్ సర్జన్లు పాల్గొంటారన్నారు. ఈ సదస్సులో ఐఎంఏ ఆంధ్రప్రదేశ్ జనరల్ సెక్రటరీ డాక్టర్ ఎంవీవీ మురళీమోహన్, రాజమహేంద్రవరం ప్రెసిడెంట్ డాక్టర్ వై.గురుప్రసాద్, సెక్రటరీ డాక్టర్ పి.విజయభాస్కర్ తదితరులు మాట్లాడారు. ఐఎంఏ డైరెక్టర్ ఆఫ్ స్టడీస్ డాక్టర్ పీఎస్ శర్మ, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ సోమనాథ్ దాస్ తదితరులు నిర్వాహకులుగా ఉన్నారు.



వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి అత్యవసర సభలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ హర్షకుమార్

ఎస్సీ వర్గీకరణను ఒప్పుకోం

వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఏర్పాటు.. మాలమహానాడు రద్దుచేసి వీవీపీఎస్‌లోకి రండి

రాజమహేంద్రవరంలో అత్యవసర సమావేశం : స్టేట్ కన్వీనర్ జీవీ హర్షకుమార్

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు3: వర్గీకరణ చేస్తే ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబుల పతనం తప్పదని అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ హెచ్చరించారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం ఈట్‌అండ్‌ప్లే కన్వెన్షన్‌లో శనివారం నిర్వహించిన అత్యవసర మాలల సమావేశంలో ఆయన మాట్లాడారు. సుప్రీంకోర్టు ధర్మాసనం ఎస్సీ వర్గీకరణ చేయాలని ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ హర్షకుమార్ నేతృత్వంలో ఉభయ తెలుగు రాష్ట్రాల వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఏర్పాటైంది. దేశంలో మాలమాదిగలను విడదీసేందుకు ఓటు బ్యాంక్ రాజకీయాలకు పెద్దకుట్ర చేశారని ధ్వజమెత్తారు. ఆగస్టు 1న సుప్రీంకోర్టు ధర్మాసనం ఇచ్చిన తీర్పుతో ఒక్కసారిగా జాతికి జరుగుతున్న అన్యాయంపై చాలా బాధ కలిగిందన్నారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 341 ప్రకారం రిజర్వేషన్లు పొందుతున్న వారిలో సమాజంలో అగ్రవర్ణాలతో సమాన స్థాయికి ఎదిగిన వారిని తొలగించడం కాని లేదా దారుణస్థితిలో ఉండి రిజర్వేషన్లు పొందని వారిని తిరిగి చేర్చడంకాని చేసే అధికారం రాష్ట్రపతి, పార్లమెంట్‌కు ఉంటుందన్నారు. అయితే విభజించాలంటే పార్లమెంట్‌లో అమెండ్‌మెంట్ చేసి మెజార్టీ తీర్మానం చేయాలని దాని ప్రకారం సుప్రీంకోర్టు తీర్పు ఉంటుందన్నారు. కానీ ఏడుగురు జడ్జిల ధర్మాసనం ఏకపక్షంగా తీర్పునివ్వడం దారుణమన్నారు. ఇందులో న్యాయమూర్తి త్రివేది ఈ తీర్పును వ్యతిరేకించారని చెప్పారు. మాలమాదిగలను విడదీసి భవిష్యత్‌లో రిజర్వేషన్లు ఎత్తివేయాలనే కుట్ర దాగి ఉందన్నారు. అందుకే వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాటం చేయాలని నిర్ణయించుకున్నానని చెప్పారు. మాలమహానాడు, సంఘాలను రద్దు చేసుకుని అందరూ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితిలోకి రావాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. గ్రామ స్థాయి నుంచి ఉద్యమాన్ని తీవ్రతరం చేయాలన్నారు. మల్లెల వెంకట్రావు ఢిల్లీలో సుప్రీంకోర్టులో వాజ్యం దాఖలు చేసే పనిలో ఉన్నారని, తాను కూడా న్యాయపోరాటం చేస్తానన్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని మాలలు కదలకపోతే తీవ్రంగా నష్టపోతామన్నారు. విధివిధానాలు లేకపోయినా అప్పుడే తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అమలుచేస్తామని ప్రకటించారని, ఆంధ్రప్రదేశ్‌లోగాని వర్గీకరణ జరిగితే తీవ్రస్థాయిలో ఉద్యమాలు చూస్తారని హెచ్చరించారు. లీగల్ కమిటీ, యువజన కమిటీలను ఏర్పాటు చేయాలని ఆయా నాయకులకు హర్షకుమార్ సూచించారు. తెలంగాణ మాల సంఘాల నేతలు టి.రవి (మిర్యాలగూడ), బాలస్వామి (నాగర్‌కర్నూల్), అనిల్‌కుమార్ (పాలమూరు), డాక్టర్ మునిబాబు, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన అంబటి కొండలరావు, బి.చంద్రయ్య (ప్రకాశం), వెంకటేశ్వరరావు (అనకాపల్లి), మాలమహానాడు రాష్ట్ర అధికార ప్రతినిధి బెన్నయ్య, అరుణకుమారి (గుంటూరు), జ్యోతి మేరి, ఈశ్వరి (ఎన్‌టీఆర్ జిల్లా), జంగా బాబూరావు, జీవీ శ్రీరాజ్, రఘుబాబు మాట్లాడారు. మాల ఉద్యోగుల సంఘం స్టేట్ కన్వీనర్‌గా భరత్‌భూషణ్‌ను ప్రకటించారు. అనంతరం ఐదు తీర్మానాలు చేశారు. ఐకమత్యంలో ఉద్యమించాలని, ఉభయతెలుగు రాష్ట్రాల్లో అన్ని మాల సంఘాలను రద్దు చేసి వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితిలోకి రావాలని, వర్గీకరణ ఉద్యమానికి మాల ఉద్యోగులు పూర్తి సపోర్టుగా ఉండాలని, లీగల్ కమిటీ గైడెన్స్‌లో [illegible]



పెదబ్రహ్మదేవంలో మైనర్ బాలికపై అత్యాచారయత్నం

యువకుడికి దేహశుద్ధి.. ఇరువర్గాలపైనా కేసులు

సామర్లకోట, ఆగస్టు 3: కాకినాడ జిల్లా సామర్లకోట మండలం పెదబ్రహ్మదేవం గ్రామంలో ఒక సామాజిక వర్గానికి చెందిన మైనర్ బాలికపై అత్యాచారయత్నానికి పాల్పడ్డాడన్న ఫిర్యాదుపై గ్రామానికి చెందిన చాపల అజయ్ యువకుడిని ప్రోత్సహించారన్న నేరంపై నలుగురు వ్యక్తులపైనా ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. ఇదే సంఘటనలో దళిత యువకుడిపై ఏడుగురు వ్యక్తులు దౌర్జన్యంచేసి గాయపర్చారన్న రెండోవర్గం చేసిన ఫిర్యాదు మేరకు సామర్లకోట పోలీసులు ఎస్సీ, ఎస్టీ చట్టం కింద కేసు నమోదు చేశారు. గ్రామంలో ఈ ఘటనతో శాంతిభద్రతలు అదుపుతప్పకుండా ముందస్తు జాగ్రత్త చర్యలుగా గ్రామంలో పెద్దఎత్తున పోలీసు బందోబస్తు నిర్వహించారు. రాత్రికి నిరంతరం పోలీసు పికెట్ ఉంచేలా పోలీసు ఉన్నతాధికారులు ఆదేశించారు. గ్రామానికి చెందిన మైనర్ బాలిక కాకినాడ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ చదువుతుండగా అదేగ్రామానికి చెందిన దళిత యువకుడు తాను ప్రేమిస్తున్నానని వెంటబడుతుండడమేగాక ఈ నెల 1న సదరు బాలికను కిడ్నాప్‌చేసి 2న గ్రామంలో బస్టాండ్ వద్ద విడిచిపెట్టినట్టు సమాచారం. కాగా శనివారం అజయ్ మోటార్ సైకిల్‌పై బాలిక ఇంటికి చేరుకుని అత్యాచారయత్నానికి పాల్పడడంతో బాలిక కేకలకు కుటుంబసభ్యులు, బంధువులు అక్కడకు చేరుకుని యువకుడికి దేహశుద్ధి చేశారు. బాలిక, తాను గత కొంతకాలంగా ప్రేమించుకుంటున్నామని యువకుడు పోలీసులకు చెప్పగా తాను ఈనెల 1న బాలికను కాకినాడ తీసుకెళ్లినట్టు అంగీకరించినట్టు సమాచారం. అయితే యువకుడి చేతులుకట్టి కొట్టికిందపడవేసిన దృశ్యాలు సామాజిక మాధ్యమాలలో ఉదయం నుంచీ వైరల్ కావడంతో పోలీసులు స్పందించారు. పెద్దాపురం డీఎస్పీ కె.లతాకుమారి, సామర్లకోట సీఐ అంకబాబు తదితర పోలీసులతో కలిసి సంఘటనా స్థలి అయిన పెదబ్రహ్మదేవం చేరుకున్నారు. అప్పటికే గ్రామంలో ఇరువర్గాల మధ్య ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. ఇరువర్గాల నుంచి వాస్తవసమాచారాన్ని సేకరించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు అజయ్ వాంగ్మూలం కూడా పోలీసులు సేకరించారు. ఇరువర్గాల ఫిర్యాదుల మేరకు రెండు వైపులా కేసులు నమోదు చేసినట్టు సామర్లకోట పోలీసులు శనివారం రాత్రి చెప్పారు. గాయపడిన అజయ్ కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడని, ప్రాణాపాయం ఏమీలేదని గ్రామంలో పోలీసుపికెట్ కొనసాగుతుందన్నారు.

ఇంజనీరింగ్ అసిస్టెంట్ సస్పెన్షన్

రాజమహేంద్రవరంరూరల్, ఆగస్టు3: రాజమహేంద్రవరం రూరల్ మండలం బొమ్మూరు సచివాలయం-3లో ఇంజనీరింగ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న విప్పర్తి నిఖిల్ కృష్ణపై సస్పెన్షన్ వేటు పడింది. ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ప్రభుత్వం ప్రాధాన్యతాంశంగా చేపట్టిన పెన్షన్ల పంపిణీ ఉదయం 5 గంటల నుంచే పంపిణీ చేపట్టాలంటూ కలెక్టర్ ఆదేశాలు జారీచేశారు. అయితే నిఖిల్‌కృష్ణ 10 గంటల వరకు లాగిన్ ఓపెన్ చేయకపోవడంతో కలెక్టర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. విధుల నిర్వహణలో అలసత్వంగా వ్యవహరించినందుకు సస్పెండ్ చేశారు. ఈ సంఘటన ఈనెల 1న జరిగింది. సదరు ఇంజనీరింగ్ అసిస్టెంట్ తండ్రి జిల్లా పరిషత్ ఛైర్మన్ కావడంతో సంబంధిత అధికారులు విషయాన్ని బయటకు రానీయకుండా గోప్యంగా ఉంచినట్టు తెలిసింది. ప్రతీ సమాచారాన్ని తెలిపే డీపీఆర్‌వో ఈ సమాచారాన్ని గోప్యంగా ఉంచడం విమర్శలకు దారితీసింది.

గోదావరిలో దూకిన వ్యక్తి కోసం గాలింపు

పి.గన్నవరం, ఆగస్టు 3: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం అక్విడెక్టుపై నుంచి శనివారం గుర్తు తెలియని వ్యక్తి దూకడంతో వరదనీటిలో గల్లంతయ్యాడు. కొత్త అక్విడెక్టుపై చెప్పులు వదిలి గోదావరిలో దూకేసినట్టు ప్రత్యక్ష సాక్షులు చెప్పారు. అతడు దూకే సమయంలో అటుగా వెళ్తున్న ఆటో డ్రైవర్ వచ్చే ప్రయత్నం చేయగా, అప్పటికే నీటిలో దూకేసినట్టు చెప్పారు. కొత్త అక్విడెక్టుపై నుంచి దూకిన వ్యక్తి పాత అక్విడెక్టు దాటేవరకు కనిపించాడని గోదావరిలో గేలం వేస్తున్న వ్యక్తులు చెప్పారు. తహశీల్దార్ ఎస్కే హుస్సేన్, అంబాజీపేట ఎస్ఐ కె.చిరంజీవి, ఏఎస్ఐ ఎన్.పట్టాభిరామయ్య, ఇన్‌చార్జ్ ఆర్ఐ పి.నరసింహారావులు సంఘటనా స్థలానికి చేరుకుని స్థానికుల నుంచి వివరాలు సేకరించారు. అనంతరం ఉడిమూడిలో ఉన్న ఎన్డీఆర్ఎఫ్ బృందాన్ని సంఘటనా స్థలానికి రప్పించి గాలింపు చర్యలు చేపట్టారు. అయితే ఆ వ్యక్తి ఆచూకీ ఇంకా లభ్యం కాలేదు.



వరద నీటి నుంచి బయటపడిన డ్రెడ్జింగ్ నావ

వరద నీటి నుంచి బయటపడిన డ్రెడ్జింగ్ నావ

ధవళేశ్వరం, ఆగస్టు 3: కాటన్ బ్యారేజ్ గేటుకు అడ్డంగా మునిగిన డ్రెడ్జింగ్ నావ గోదావరి నీటిమట్టం తగ్గి నీటి నుంచి బయటకు కనిపిస్తుండడంతో శనివారం బయటకు తీయడానికి నావ యజమానులు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. నావకు ఐరన్ రోప్‌లు కట్టి కప్పీల సహాయంతో ఆ ప్రాంతం నుంచి ఒడ్డుకు లాగడానికి చేసిన ప్రయత్నాల్లో బలమైన ఇనుప రోప్ సైతం తెగిపోయింది. నావ దిగువ భాగం బురదలో దిగబడిపోవడంతో బయటకు లాగడానికి చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. వరద ఉధృతికి గాయిత్రి ఇసుక ర్యాంప్ వద్ద లంగరు వేసిన డ్రెడ్జింగ్ నావ గత నెల 25న కాటన్ బ్యారేజ్ వద్దకు కొట్టుకు వచ్చి 1వ నెంబరు గేటుకు అడ్డంగా మునిగిపోయింది. ప్రస్తుతం నీటి మట్టం తగ్గుముఖం పట్టడంతో గేటును ఆపరేట్ చేయడానికి అడ్డంకిగా మారిన నావను బయటకు తీయడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. ఆదివారం మరింత పకడ్బందీ ఏర్పాటుతో నావను బయటకు లాగడానికి జరుగుతున్న ఏర్పాట్లు బ్యారేజ్ ఏఈఈ నాగలక్ష్మి పర్యవేక్షిస్తున్నారు.

గోదావరి వరద తగ్గుముఖం

ధవళేశ్వరం బ్యారేజీ వద్ద నీటిమట్టం 8.50 అడుగులు

రాజమహేంద్రవరం, ఆగస్టు3(ఆంధ్రజ్యోతి): గోదావరి వరద బాగా తగ్గుతోంది. జూలై 19వ తేదీ నుంచి పెరగడం మొదలెట్టిన వరద గోదావరి పెరుగుతూ, తగ్గుతూ, మళ్లీ పెరుగుతూ వచ్చిన సంగతి తెలిసిందే. కానీ రెండు రోజుల నుంచి బాగా తగ్గుతోంది. ధవళేశ్వరం బ్యారేజీ వద్ద శనివారం సాయంత్రం 5 గంటలకు నీటిమట్టం 8.50 అడుగులుగా ఉంది. బ్యారేజీ నుంచి సముద్రంలోకి 5,81,417 క్యూసెక్కులు వరద ప్రవాహం వెళుతోంది. ధవళేశ్వరం వద్ద గోదావరి పాండ్ లెవల్ 13.26 మీటర్లుగా ఉంది. గోదావరి డెల్టా కాలువలకు 8,800 క్యూసెక్కులు పంపిస్తున్నారు. భద్రాచలం వద్ద నీటిమట్టం సాయంత్రం 5 గంటలకు 33.90 అడుగులకు చేరింది. కాగా ఎగువ భాగంలో వర్షాలులేవని అధికారులు చెబుతున్నారు. కాళేశ్వరం వద్ద స్వల్పంగా పెరుగుతుండగా ఆ ప్రభావంతో భద్రాచలం వద్ద 33.10 అడుగుల వరకు తగ్గిన నీటిమట్టం నిదానంగా పెరుగుతూ శనివారం రాత్రి 7 గంటలకు 34.10 అడుగులకు చేరింది. భద్రాచలంలో ఇక పెరుగుదల లేకపోతే మొత్తం వరద లాగేస్తుంది. పొలాలు, డ్రైన్లలోని నీరు కూడా దిగిపోతుంది. వరి రైతులు తిరిగి మళ్లీ వెదజల్లే పద్ధతిలో సాగుకు వెళతారా, ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకుంటారా అనేది తేలనుంది.

శృంగారవల్లభ ఆలయానికి పోటెత్తిన భక్తులు

పెద్దాపురం, ఆగస్టు 3: మండలంలోని తిరుపతి శృంగారవల్లభస్వామి ఆలయానికి శనివారం భక్తులు అధికంగా పోటెత్తారు. టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.1,40,120, అన్నదాన విరాళాలు రూ.64,745, కేశఖండన ద్వారా రూ.3,800, ప్రసాద విక్రయం ద్వారా 15,390, తులాభారం ద్వారా రూ.150 వెరసి రూ. 2,24,205 ఆదాయం సమకూరినట్లు ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. సుమారు 5వేల మంది స్వామిని దర్శించుకున్నారు.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం • తుని ● ప్రత్తిపాడు ● జగ్గంపేట

'చంద్రమౌళి కుటుంబాన్ని ఆదుకుంటాం'

తాళ్లరేవు, ఆగస్టు 3: టీడీపీ కోరింగ గ్రామకమిటీ అధ్యక్షుడు, మండల దళిత యునైటెడ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంటపల్లి చంద్రమౌళి కుటుంబాన్ని కూటమి ప్రభుత్వం ద్వారా ఆదుకుంటామని టీడీపీ నేత టేకుమూడి లక్ష్మణరావు అన్నారు. శనివారం తాళ్లరేవు టీడీపీ కార్యాలయంలో మండల ప్రధాన కార్యదర్శి కట్టా త్రిమూర్తులు అధ్యక్షతన చంద్రమౌళి సంతాపసభ నిర్వహించారు. కూటమి నేతలు, కార్యకర్తలు చంద్రమౌళి చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. ఆయన ఇద్దరు పిల్లల చదువు పార్టీపరంగా కొనసాగేలా భరోసా ఇవ్వాలని ఏకగ్రీవ తీర్మానం చేశారు. టీడీపీ నేతలు మందాల గంగసూర్యనారాయణ, ధూళిపూడి వెంకటరమణ, వాడ్రేవు వీరబాబు, పొన్నమండ రామలక్ష్మీ, పెమ్మాడి కృష్ణవేణి, జనసేన నేతలు అత్తిలి బాబూరావు, బండారు దొరబాబు, దళిత నేతలు జక్కల ప్రసాద్‌బాబు,భైరవమూర్తి ఉన్నారు.

'సమగ్ర సస్యరక్షణ పద్ధతులతో అధిక దిగుబడులు'

గొల్లప్రోలు రూరల్, ఆగస్టు 3: వరి సాగులో సమగ్ర సస్యరక్షణ పద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగుబడులు పొందవచ్చని వ్యవసాయశాఖ జిల్లా వనరుల కేంద్రం సహాయ సంచాలకురాలు వి.భ్రమరాంబ సూచించారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలు గ్రామంలో శనివారం నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో ఆయన వరి నాట్లు వేయడంలో మెలకవులు, నాట్లు అనంతరం తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. 14వారాల పాటు రైతులకు వివిధ అంశాలపై క్షేత్రస్థాయిలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి సత్యనారాయణ, బుద్దాల చంటిబాబు, పెద్దింటి శివ, ఓరుగంటి సుధ తదితరులు పాల్గొన్నారు.

క్వారీ లారీలను అడ్డగించి ధర్నా

తొండంగి, ఆగస్టు 3: మితిమీరిన వేగంతో వెళ్తూ ప్రమాదలకు కారణమైన క్వారీ లారీని తొండంగి గ్రామస్తులు శనివారం రాత్రి స్థానిక కృష్ణాలయం సెంటర్లో అడ్డగించి ధర్నాకు దిగారు. గతనెల 31 రాత్రి గ్రామానికి చెందిన శివకుమార్ అనే యువకుడిని క్వారీ లారీ ఢీ కొనడంతో తీవ్ర గాయాలై కాకినాడలో చికిత్స పొందుతున్నాడని తెలిపారు. చికిత్సకు అవసరమైన అన్ని సహాయాలు తామందిస్తామని చెప్పి లారీల యాజమాన్యం మొండికేసిదన్నారు. వైద్య ఖర్చుల నిమిత్తం లారీల యాజమాన్యం, పోర్టు యాజమాన్యం ఏ ఆర్థిక సాయం అందించనందుకు నిరసనగా ఆందోళన చేస్తున్నట్టు తెలిపారు. నిర్మాణంలో ఉన్న పోర్టుకు క్వారీ రాళ్లను తరలిస్తున్న లారీలను నిలుపు చేసి యాజమాన్యం వచ్చి సమస్య పరిష్కరించే వరకూ కదలనివ్వబోమని వారు భీష్మించారు. దీంతో సుమారు 30 వరకూ క్వారీ లారీలు నిలిచిపోయాయి.

7న దివ్యాంగుల ఉపకరణాల గుర్తింపు శిబిరం

ప్రత్తిపాడు, ఆగస్టు 3: ప్రత్తిపాడు మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 7న దివ్యాంగుల ఉపకరణాల మంజూరు గుర్తింపు శిబిరం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో ఎస్.డేవిడ్‌రాజు తెలిపారు. శనివారం ఆయన స్థానిక విలేఖరులతో మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు అల్మ్కో సంస్థ సహకారంతో ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ 7న ఉదయం 9గంటలకు ప్రారంభించే ఈ శిబిరంలో నియోజకవర్గంలోని ప్రత్తిపాడు, ఏలేశ్వరం, శంఖవరం రౌతులపూడి మండలాల దివ్యాంగులు పాల్గొనవచ్చన్నారు. 3చక్రాల సైకిల్స్, చంకకర్రలు, కాలిపర్స్, చెవి మిషన్లు, వీల్స్ ఛైర్స్, కృత్రిమ కాళ్ళు, రోలేటర్స్, లెప్రసీ కిట్లు, 3చక్రాల సైకిల్ళు తదితర పరికరాలు మంజూరుకు దివ్యాంగులను ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. లబ్ధిదారులు సదరం సర్టిఫికెట్, రేషన్‌కార్డు, ఆధార్ కార్డు, యుడిఐటీ కార్డులతో హాజరుకావాలని.. మోటార్ సైకిల్ మినహా అన్ని ఉపకరణాలకు 40శాతం అంగవైకల్యం తప్పనిసరి అని ఎంపీడీవో డేవిడ్‌రాజు వివరించారు.

6న తునిలో...

తునిరూరల్, ఆగస్టు 3: దివ్యాంగులకు అవసరమైన పరికరాలు అందజేసేందుకు ధ్రువపత్రాల స్వీకరణకు ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేస్తున్నట్టు తుని మున్సిపల్ కమిషనర్ వెంకట్రావు తెలిపారు. ఈనెల 6న ఉదయం 10 గంటల నుంచి 3గంటల వరకు తుని మున్సిపల్ కార్యాలయంలో జరిగే కార్యక్రమంలో నియోజకవర్గానికి చెందిన దివ్యాంగులు ధ్రువపత్రాలను అందజేసి వివరాలు నమోదు చేయించుకోవాలన్నారు.

దివ్యాంగుల ఉపకరణాల గుర్తింపు శిబిరం

జగ్గంపేట, ఆగస్టు 3: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో అల్మ్కో సంస్థ సహకారంతో దివ్యాంగుల ఉపకరణాల గుర్తింపు శిబిరం శనివారం దివ్యాంగుల వయోవృద్ధుల సహకార సంస్థ సహాయ సంచాలకులు పాఠంశెట్టి నారాయణమూర్తి పర్యవేక్షణలో జరిగింది. దివ్యాంగులందరికీ భోజన సదుపాయం కల్పించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ జగ్గంపేట ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్, అత్తులూరి నాగబాబు, జడ్పీటీసీ ఒమ్మి బిందుమాధవి, ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, జిల్లా దివ్యాంగుల అధ్యక్షుడు మండపాల అప్పన్నదొర, ఉమామనోవికాస కేంద్రం డైరెక్టర్ పెద్దిరెడ్డి, జీను మణిబాబు,ఎంపీడీవో వసంత్‌కుమార్, కొత్త కొండబాబు, వేముల కొండ జోగారావు ఉన్నారు.

రేపు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ రద్దు

పిఠాపురం, ఆగస్టు 3: రెండు సోమవారాలకు ఒకసారి పిఠాపురం రథాలపేట అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ఈ సోమవారం రద్దయింది. ఈనెల 5న పిఠాపురంలో నిర్వహించాల్సిన పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ సగిలి షాన్‌మోహన్ ఓ ప్రకటనలో తెలిపారు. ఆ రోజు కాకినాడ కలెక్టరేట్‌లో యధావిధిగా పీజీఆర్ఎస్ కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించాలని ఆయన సూచించారు.

రాజకీయ వేధింపులపై 5న కలెక్టరేట్ వద్ద ధర్నా

కాకినాడ సిటీ, ఆగస్టు 3: రాష్ట్రంలో స్కీం వర్కర్లైన అంగన్‌వాడీ, ఆశ, యానిమేటర్లు, మధ్యాహ్న భోజన పథకం కార్మికులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్మికులపై రాజకీయ వేధింపులు పెరిగిపోయాయని, దీన్ని నిరసిస్తూ ఈ నెల 5న కలెక్టరేట్ వద్ద తలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దువ్వా శేషబాబ్జీ, చెక్కల రాజ్‌కుమార్ శనివారం కాకినాడలో పిలుపునిచ్చారు.

'కృష్ణాష్టమి వేడుకలకు సిద్ధం కావాలి'

ఏలేశ్వరం, ఆగస్టు 3: రాబోయే కృష్ణాష్టమి వేడుకలకు సిద్ధం కావాలని విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి చిక్కం సత్యనారాయణ తెలిపారు. శనివారం విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో క్రియాశీలక సభ్యుల సమావేశం నిర్వహించారు. సత్యనారాయణ మాట్లాడుతూ విశ్వహిందూ పరిషత్ ఏర్పడి 60ఏళ్లు పూర్తయిన సందర్భంగా కృష్ణాష్టమికి వేడుకలు ఘనంగా నిర్వహించి ప్రతీ గ్రామంలోనూ శోభా యాత్ర నిర్వహించాలన్నారు. తిరుపతిరావు, ఉమామహేశ్వరావు, అలమండ దుర్గావెంకట ప్రసాద్, కటకం కిరీటి, గట్టెం వెంకటరమణ, రాతికింద కృష్ణారావు, రెడ్డి లోవరాజు పాల్గొన్నారు.

'యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించాలి'

శంఖవరం, ఆగస్టు 3: రైతులకు పంటల సాగులో యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించాలని మండల వ్యవసాయాధికారి పి.గాంధీ సిబ్బందికి సూచించారు. శంఖవరంలో వ్యవసాయ, ఉద్యాన, సెరికల్చర్ సహాయకులతో సమవేశం నిర్వహించారు. వరి నాటే సమయంలో తీసుకోవాల్సిన జగ్రాత్తలు, ఎరువులు, యాజమాన్యం, జీవన ఎరువులు ప్రాధాన్యత విషయాలపై సూచనలు చేశారు. కార్యక్రమంలో సిబ్బంది మణికంఠ, శ్రావణి, బిందు, రామలక్ష్మి, ప్రభాస్, విలియం, క్రాంతి పాల్గొన్నారు.

'ఆదిత్య'లో ముగిసిన శిక్షణ

గండేపల్లి, ఆగస్టు 3: సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్శిటీ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో స్టెల్లా 5.0 అనే అత్యాధునిక అంశంపై శిక్షణా తరగతి విజయవంతంగా ముగిసిందని డిప్యూటీ ప్రోచాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఇందిరాగాంధీ టెక్నికల్ యూనివర్శిటీ ఫర్ ఉమెన్స్ న్యూఢిల్లీ, సీఎస్‌సి విభాగంలో విశేష సేవలందిస్తున్న డాక్టర్ ఎస్.రామనారాయణరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ఆచరణాత్మకంగా వివరించారు. ఆదిత్య గ్లోబల్ బిజినెస్ స్కూల్‌లో ఫాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం పోస్టర్‌ను ఆవిష్కరించారు. డాక్టర్ ఎన్.సుగుణరెడ్డి పాల్గొన్నారు.

పుర్హుతికా అమ్మవారికి సారె సమర్పణ

పిఠాపురం, ఆగస్టు 3: పిఠాపురం పాదగయ క్షేత్రంలో రాజరాజేశ్వరీ సమేత ఉమాకుక్కుటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న అష్టాదశ శక్తి పీఠాల్లో దశమశక్తి పీఠానికి అధిష్ఠాన దేవతయిన పుర్హుతికా అమ్మవారికి మహిళలు శనివారం సారె సమర్పించారు. పట్టణంలోని జగ్గయ్యచెరువు కాలనీకి చెందిన మహిళలు పిండివంటలు, పండ్లు, పుష్పాలు, పసుపు, కుంకుమ తీసుకుని ప్రదర్శనగా పాదగయకు తరలివచ్చారు. పుర్హుతికాఅమ్మవారు, రాజరాజేశ్వరీదేవిలకు సారె సమర్పించి ఆలయంలో పూజలు నిర్వహించారు.ఆలయ ఈవో, సహాయ కమిషనరు దుర్గాభవానీ పాల్గొన్నారు.

పీఎం, సీఎం చిత్రపటాల ఏర్పాటు

సామర్లకోట, ఆగస్టు 3: మండలంలోని హుస్సేన్‌పురం పంచాయతీ కార్యాలయంలో పీఎం నరేంద్రమోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చిత్రపటాలను గ్రామ కూటమి పార్టీ నాయకులు చల్లా బుజ్జి, కోట అప్పారావు, చల్లా వెంకటరమణ, కాకి శ్రీనివాస్, నొక్కి రమణ, గుడాల గణేష్ తదితరుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. గ్రామపంచాయతీ కార్యదర్శి కర్రి శ్రీనివాస్‌కు చల్లా బుజ్జి తదితరులు 3చిత్రపటాలను అందజేయగా ఏర్పాటు చేశారు. గ్రామ తాగునీటి పైప్ లైన్‌లో ఇన్‌లైన్ క్లోరినేషన్ చర్యల్లో భాగంగా క్లోరినేషన్ ట్యాబ్లెట్‌లను వేసే కార్యక్రమాన్ని బుజ్జి నిర్వహించారు.

సిరిపురంలో రైతులకు అవగాహన

ఏలేశ్వరం, ఆగస్టు 3: మండలంలోని సిరిపురం గ్రామంలో శనివారం వ్యవసాయాధికారి బి.జ్యోతి నేతృత్వంలో రైతులకు పొలంబడి కార్యక్రమాన్ని ఉద్దేశించి బ్యాలెట్ బాక్స్ పరీక్ష, సుడోమోనాస్, విత్తన శుద్ధి, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఉద్యానవన సహాయకులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు

ఎస్సీ వర్గీకరణపై సుప్రీం తీర్పుపై హర్షాతిరేకాలు



కరప: జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పించిన నాయకులు.. పిఠాపురంలో అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు నివాళి

కరప, ఆగస్టు 3: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తూ ఎస్సీ నాయకులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. నడకుదురులో శనివారం ఎస్సీ నాయకులు, కూటమి నాయకులు కలిసి బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ కోసం మూడు దశాబ్దాలు పైబడి అలుపెరగని పోరు సాగించామన్నారు. సుప్రీం తీర్పుతో తమ జాతికి విద్య, ఉద్యోగావకాశాలు మెరుగుపడతాయని ఆశాభావం వ్యక్తంచేశారు. ఏబీసీడీ వర్గీకరణ కోసం నిర్విరామంగా పోరాడిన ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ, 2000 -04 వరకు వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి అమలుచేసిన అప్పటి, ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు చీపురపల్లి జయేంద్ర బాబు, రెడ్డి రమణేశ్వర్, గొల్లపల్లి చంద్రశేఖర్, చాట్ర ఇమ్మానుయేల్, మెండు గోవిందు, పుష్పలత, ఎస్సీ నాయకులు ఉందుర్తి రత్నం, వెంకట్రావు, కె.ఏసు, ఎం.ప్రభుదాస్, జుత్తుక రాజేష్, ఎం.సురేష్, ఎం.చిన్న, యు.సత్యానందం, ఎ.రమణ పాల్గొన్నారు.

తునిరూరల్: దళితులకు అండగా నిలిచేది కూటమి ప్రభుత్వమేనని తుని ఎమ్మెల్యే యనమల దివ్య అన్నారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తూ నియోజకవర్గానికి చెందిన పలువురు దళిత నాయకులు, దళిత సంఘాల ప్రతినిధులు ఎమ్మెల్యేను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఆమె వెంట టీడీపీ నాయకులు యనమల రాజేష్, జిల్లా టీడీపీ ఉపాధ్యక్షులు సుర్ల లోవరాజు, చింతమనీడి నాగ సోమరాజు (అబ్బాయి), మోతుకూరి వెంకటేష్, గజ్జి రాంబాబు, చిరంజీవిరాజు ఉన్నారు.

గొల్లప్రోలు: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు చారిత్రాత్మకమని జనసేన పిఠాపురం ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు అన్నారు. సుప్రీం తీర్పు, రెల్లిజాతి సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ వారి సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు వర్గీకరణకు సహకారమందించిన జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు కృతజ్ఞతలు తెలియజేసేందుకు రెల్లి సంఘం ప్రతినిధులు గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని పవన్ నివాసంలో మర్రెడ్డిని కలిసి సత్కరించారు. పవన్‌కు తమ కృతజ్ఞతలు తెలియజేయాల్సిందిగా కోరారు. న్యాయవాది బంగారు రామకృష్ణ, సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

పిఠాపురం: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో ఉపకులాలకు మేలు జరుగుతుందని బీజేపీ, ఎమ్మార్పీఎస్ నాయకులు అన్నారు. పట్టణంలోని జీవన్‌నగర్‌లో గల భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మాజీ ఉపప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు దాట్ల వెంకట సూర్యనారాయణరాజు, గండి కొండలరావు, పట్టణాధ్యక్షుడు పసుపులేటి సత్యనారాయణ, బుర్రి మురళీధరరావు, తోట ఏడుకొండలు, ఓలేటి వెంకటేశ్వరరావు, లింగంపల్లి రవీంద్రబాబు ఉన్నారు.

జగ్గంపేట: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం తీర్పుపై ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు స్థానిక ట్రావెల్స్ బంగ్లా నుంచి పోలీస్‌స్టేషన్ మీదుగా ఎస్సీ పేటకు భారీ ర్యాలీగా ఊరేగింపు నిర్వహించారు. అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలలు వేశారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కాకాడ నూకరాజు మాదిగ, కార్యక్రమంలో అధ్యక్షులు అరుగోళ్ళు పందు మాదిగ, ఎంఎస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శి దూలపల్లి వెంకటరమణ మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు అనంతారపు రాజు మాదిగ, ఎమ్మార్పీఎస్ నాయకులు మోర్త తాతారావు మాదిగ, కొత్తపల్లి మోహన్ మాదిగ, జుత్తుక రమణ మాదిగ ఉన్నారు.

'కాలుష్య నియంత్రణకు చర్యలు తీసుకోవాలి'



సీఎం చంద్రబాబుకు వివరిస్తున్న అనంతలక్ష్మి దంపతులు

సర్పవరం జంక్షన్, ఆగస్టు 3: కాకినాడ తీరప్రాంతంలో నెలకొన్న కోరమండల్,జెమెని, అదానీ తదితర పరిశ్రమలు విడుదల చేస్తున్న కాలుష్యంతో ప్రజలు తీవ్ర అనారోగాలబారిన పడుతున్నారని, కాలుష్య నియంత్రణ చర్యలు తీసుకోవాలని కోరుతూ ముఖ్యమంత్రి చంద్రబాబుకు రూరల్ టీడీపీ కోఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణమూర్తి, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి దంపతులు వినతి పత్రం అందించారు. శనివారం సచివాలయంలో చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిసి పూలబొకేతో అభినందించారు. వారు మాట్లాడుతూ రూరల్‌లో 6 గ్రామ పంచాయతీలతో పాటూ 42,48 డివిజన్లకు ఎన్నికలు నిర్వహించకపోవడంతో ఇబ్బందులు ఉన్నాయని వివరించారు. సానుకూలంగా చంద్రబాబు స్పందించారని వీటిపై తగిన నిర్ణయం తీసుకుంటానని హామీ ఇచ్చినట్టు తెలిపారు.

చంద్రబాబును కలిసిన పావని



కాకినాడ సిటీ, ఆగస్టు 3: సీఎం చంద్రబాబును శనివారం మంగళగిరి టీడీపీ కార్యాలయంలో కాకి నాడ మాజీ మేయర్ సుంకర పావని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చేపడుతున్న పార్టీ కార్యక్రమాలను ఆమె వివరించారు. టీడీపీ నగర మాజీ అధ్యక్షుడు సుంకర తిరుమలకుమార్ పాల్గొన్నారు.

కృష్ణతేజను కలిసిన ఎమ్మెల్యే

సర్పవరం జంక్షన్, ఆగస్టు 3: రాష్ట్ర పంచాయతీరాజ్, రూరల్ డవలెప్‌మెంట్ డైరెక్టర్ మైలవరపు కృష్ణతేజను శనివారం సాయంత్రం కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ మర్యాద పూర్వకంగా కలుసుకుని శాలువా కప్పి అభినందనలు తెలిపారు. రూరల్ నియోజకవర్గంలో పీఆర్, రూరల్ డవలెప్‌మెంట్ శాఖలకు చెందిన పలు సమస్యలు, అంశాలపై చర్చించి, అభివృద్ధి కోసం తీసుకోవాల్సిన చర్యలపై డైరెక్టర్‌తో చర్చించారు. జిల్లా పర్యటనకు రావాలని కృష్ణతేజను ఆహ్వానించినట్టు నానాజీ తెలిపారు.

స్పీకర్‌ను కలిసిన జనసేన నేత

గొల్లప్రోలు రూరల్, ఆగస్టు 3: రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడుని జనసేన పార్టీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శి జ్యోతుల శ్రీనివాస్ కలిశారు. జనసేన నేతలతో కలిసి శనివారం నర్సీపట్టణంలోని స్పీకర్ నివాసానికి వెళ్లి అభినందనలు తెలిపారు.

'మాదక ద్రవ్యాల వినియోగం సమాజానికి అనర్థం'

కాకినాడ క్రైం, ఆగస్టు 3: మాదక ద్రవ్యాల వినియోగం వ్యక్తిగతంగా ఆరోగ్యపరమైన అనర్థమే కాకుండా యావత్తు సమాజానికి అనర్థదాయకమని మండల లీగల్ సర్వీసెస్ కమిటీ అధ్యక్షురాలు, కాకినాడ మూడో జిల్లా అదనపు సెషన్స్ జడ్జి జస్టిస్ పి.కమలాదేవి అన్నారు. లీగల్ సెల్ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాలు, పొగాకు ఉత్పత్తుల వినియోగం, అనర్థాలు అనే అంశంపై కాకినాడ రంగరాయ వైద్యకళాశాల ఆడిటోరియంలో శనివారం వైద్య విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా డాక్టర్ ఎన్‌టీఆర్ వైద్యవిశ్వవిద్యాలయం వీసీ, డీఎంఈ, ఆర్ఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం, సెబ్ అడిషనల్ ఎస్పీ శ్రీలక్ష్మి, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.లావణ్యకుమారి, ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ ఎ.విష్ణువర్ధన్, దేవీమాధవి పాల్గొన్నారు. కమలాదేవి మాట్లాడుతూ యువత డ్రగ్స్‌కు ఆకర్షితులు కాకుండా మంచి ప్రయోజకులై అందరికీ ఆదర్శంగా నిలవాలన్నారు. డాక్టర్ నరసింహం మాట్లాడుతూ ప్రతి విద్యార్థి సామాజిక అంశాలను బాధ్యతగా తీసుకుని మాదక ద్రవ్యాలపై యుద్ధం చేయాలన్నారు. సీనియర్ అడ్వకెట్ వై.వసంత, ఫోరెన్సిక్ హెచ్‌వోడీ డాక్టర్ ఉమామహేశ్వరావు, సైకియాట్రీ హెచ్‌వోడీ డాక్టర్ రామచంద్రరావు, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వరప్రసాద్, హాస్టల్ వార్డెన్లు డాక్టర్ వీరయ్య, డాక్టర్ లలిత, డాక్టర్ వి.కాటన్. డాక్టర్ సతీష్ పాల్గొన్నారు.

బ్లేడ్‌తో యువకుడి హల్‌చల్

హడలెత్తిపోతున్న గ్రామస్తులు

కొత్తపల్లి, ఆగస్టు 3: మండలంలో అమీనబాద్ గ్రామానికి చెందిన యువకుడు రోడ్డుపై బ్లేడ్ చేత్తో పట్టుకుని హల్‌చల్ చేస్తుండడంతో గ్రామస్తులు హడలెత్తిపోతున్నారు. శనివారం సాయంత్రం 3.30 గంటలకు స్థానిక సాలిపేట ఎలిమెంటరీ పాఠశాల నుంచి ఇళ్లకు వెళ్తున్న విద్యార్థులను వెంబడిస్తూ యువకుడు బ్లేడ్‌తో హల్‌చల్ చేశాడు. దీంతో పాఠశాల ఉపాధ్యాయులు అతడిని వారించేందుకు ప్రయత్నించగా వారిపై కూడా బ్లేడ్‌తో దాడికి తెగబడ్డాడని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రజలను హడలెత్తిస్తున్న అతడిపై చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

సుద్దగడ్డకు మళ్లీ పోటెత్తిన వరద

జగనన్న కాలనీ రహదారిపై వరద నీరు



గొల్లప్రోలు జగనన్న కాలనీ నుంచి వరద నీటిలోనే పాఠశాలలకు వెళ్తున్న విద్యార్థులు

గొల్లప్రోలు, ఆగస్టు 3: సుద్దగడ్డకు మళ్లీ వరద పోటెత్తింది. ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురవడంతో పాటు 12గంటల పాటు గొల్లప్రోలు పరిసర ప్రాంతాల్లో కురిసిన వర్షంతో సుద్దగడ్డ(కొండ)కాలువ వరద నీటితో ఉధృతంగా ప్రవహిస్తున్నది. గొల్లప్రోలు పట్టణ శివారులోని జగనన్న కాలనీకి వెళ్లే రహదారితో పాటు, గొల్లప్రోలు-తాటిపర్తి పంచాయతీరాజ్ రహదారిపై వరద నీరు ప్రవహిస్తున్నది. మధ్యాహ్నం నుంచి రాత్రి వరకూ వరద ఉధృతి పెరుగుతూనే ఉంది. ఇది మరింత పెరిగితే రాకపోకలు పూర్తిగా నిలిచేపోయే అవకాశం ఉంది. మరోవైపు జగనన్న కాలనీకి తాగునీటి సరఫరా నిలిచిపోయి అక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పది రోజులకు పైగా తాగునీరు అందడంలేదని, బయట కొనుక్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రమాదమని తెలిసినా..

వరద నీటిని దాటడం ప్రమాదకరమని తెలిసినా అదే నీటిలో విద్యార్థులను పాఠశాలలకు పంపించక తప్పడం లేదు. గొల్లప్రోలు శివారులోని జగనన్న కాలనీకి వెళ్లే రహదారిపై 3 అడుగులకు పైగా ఎత్తులో వరద నీరు ప్రవహిస్తుండగా, శనివారం అదే నీటిలో విద్యార్థులు పాఠశాలలకు వెళ్లి వచ్చారు. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా వరద నీటి ఉధృతికి కొట్టుకుపోయే ప్రమాదముంది. దీనితో విద్యార్థుల తల్లిదండ్రులు దగ్గరుండి పాఠశాలలకు పంపిస్తున్నారు.

కొనసాగుతున్న తల్లిపాల వారోత్సవాలు



జీజీహెచ్: ర్యాలీని ప్రారంభిస్తున్న అధికారులు

జీజీహెచ్ (కాకినాడ), ఆగస్టు 3: సుషేణ హెల్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కాకినాడ ప్రభుత్వాస్పత్రి ప్రాంగణంలో తల్లిపాల వారోత్సవాలు మూడోరోజు శనివారం కొనసాగాయి. ఏఎన్ఎం, జీఎన్ఎం, బీఎస్సీ నర్సింగ్, అంగన్‌వాడీ టీచర్లు, ఆశావర్కర్లతో తల్లిపాలు ముద్దు-డబ్బాపాలు వద్దు అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ర్యాలీ సాగింది. జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ నరసింహనాయక్, కాకినాడ జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.లావణ్యకుమారి, పిడియాట్రిక్స్ హెచ్‌వోడీ డాక్టర్ డి.మాణిక్యాంబ, కాకినాడ మున్సిపల్ ఈ ఈ ఎంవీకే మాధవి, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.ప్రవీణ, సీడీపీవో జ్యోతి, సీఎఫ్‌పీవో లక్ష్మి, డీసీపీవో వెంకట్, రోటరీ క్లబ్ టిక్కు, ఈశ్వర్, మిల్క్‌బ్యాంక్ డైరెక్టర్ డాక్టర్ హర్షవర్ధన్, మేనేజర్ శివ మాధవ్ పాల్గొన్నారు.

గొల్లప్రోలు రూరల్: కొడవలి గ్రామంలో తల్లిపాలవారోత్సవాలు, మహిళలు, బాలల చట్టాలపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఐసీడీఎస్ సీడీపీవో సీహెచ్‌ఎస్‌కే దుర్గాదేవి మాట్లాడుతూ తల్లిపాలు నవజాతిశిశువులకు పట్టడం శ్రేష్ఠమని, దీని వల్ల వారిలో రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. సూపర్‌వైజర్ నాగమణి ఉన్నారు.

కరప: పేపకాయలపాలెంలో తల్లిపాల వారోత్సవాలు జరిగాయి. వైద్యాధికారిణి ఎంజీ లిల్ మాట్లాడారు. గర్భిణులు,బాలింతలకు పౌష్టికాహారాన్ని అందజేశారు. జనసేన నాయకుడు బోగిరెడ్డి గంగాధర్, ఎంఎల్‌హెచ్‌ఈ ఎస్‌కే రెహనా, ఏఎన్ఎం జి.విజయకుమారి, అంగన్‌వాడీలు బి.మనోజ, ఎ.దేవి, ఆశావర్కర్లు జి.శ్రీదేవి, జి.ఉమామహేశ్వరి, కె.సత్య వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

కొత్తపలి: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కోనపాపపేటలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. సూపర్‌వైజర్ యువీవీ అనంతలక్ష్మి, అంగన్‌వాడీ కేంద్ర నిర్వాహకులు, ఆయాలు పాల్గొన్నారు.

తునిరూరల్: వి. కొత్తూరులో జరిగిన కార్యక్రమంలో టీడీపీ నాయకులు రొంగల అబ్బు, పిల్లి శ్రీను, తమరాన సత్యనారాయణ, గేదెల లోవరాజు, వాసంశెట్టి రాజారావు తదితరులున్నారు.

ప్రత్తిపాడు: స్థానిక ప్రభుత్వాసుపత్రిలో తల్లిపాల అవశ్యతకను ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సౌమ్య, ఐసీడీఎస్ సీడీపీవో ఆర్‌వీఎస్ లక్ష్మి వివరించారు. బాలింతలు, చిన్నారుల తల్లులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

సర్పవరం జంక్షన్: రమణయ్యపేట ఆంజనేయనగర్‌లో గర్భిణులు, బాలింతలకు అవగాహన సమావేశం నిర్వహించారు. కాకినాడ రూరల్ నియోజకవర్గ ఐసీడీఎస్ సీడీపీవో వై లక్ష్మి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ మోర్తమ్మ, అంగన్ వాడీ టీచర్ రాజేశ్వరి తదితరులు ఉన్నారు.

సామర్లకోట: సామర్లకోట కొత్తూరు వార్డు సచివాలయ ఆవరణలో సదస్సు నిర్వహించారు. పెద్దాపురం ఐసీడీఎస్ సూపర్‌వైజరు సత్తార్‌బీబీ, అంగన్‌వాడీ సిబ్బంది బీ.రత్నకుమారి, సీతారత్నం, మంగతాయారు, పద్మావతి, ఏఎన్ ఎం శ్రీదేవి, ఎం.మాధవి, వీఆర్వో లక్ష్మి, పాల్గొన్నారు.

పురాతన వృక్షాలను సంరక్షించాలి

జేఎన్టీయూకే, ఆగస్టు 3: వర్సిటీలోని పురాతన వృక్షాలను సంరక్షించాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని జేఎన్టీయూకే ఇన్‌చార్జి ఉపకులపతి ప్రొఫెసర్ కేవీఎస్‌జీ మురళీకృష్ణ అన్నారు. విశ్వవిద్యాలయంలోని పెద్దవృక్షాలను సంరక్షించేందుకు, నీటి సంరక్షణకు తీసుకోవాల్సిన అంశాలపై రిలయన్స్ ప్రతినిధులతో ఇన్‌చార్జి వీసీ సమీక్ష నిర్వహించి పురాతన వృక్షాలను సందర్శించారు. హెరిటేజ్ వృక్షాల పరిరక్షణకు నమూనాలు రూపొందించేందుకు రిలయన్స్ సంస్థ సహకారం తీసుకుంటున్నామన్నారు. అనంతరం వర్సిటీలోని పరీక్షల విభాగం, అలూమ్నీ ఆడిటోరియం, నక్షత్రవనం, హాస్టల్ రోడ్డు, పాత ఆడిటోరియాలను రిలయన్స్ ప్రతినిధులతో కలిసి వీసీ పరిశీలించారు. రెక్టార్ కేవీ రమణ, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ రవీంద్రనాథ్, సీఈ వి.శ్రీనివాసులు, ఏఈఈలు సన్నీ ఫ్రాన్సిస్, బినవీన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వీసీ

విద్యార్థులకు కిట్లు పంపిణీ

ప్రత్తిపాడు, ఆగస్టు 3: మండలంలోని రాచపల్లి గ్రామంలో మండల పరిషత్ మెయిన్ పాఠశాల, 2వ పాఠశాల విద్యార్థులు 168 మందికి శనివారం సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థిమిత్ర స్టూడెంట్స్ కిట్లను పంపిణీ చేశారు. సర్పంచ్ సారిపల్లి లోవలక్ష్మిగంగరాజు, మండల ఉపాధ్యక్షుడు ఏనుగు శ్రీనివాస్, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ మాజీ ఛైర్మన్ బుద్ధరాజు చంటిరాజు అందజేశారు. హెచ్ఎమ్ ఎం.రాజబాబు, పాల్గొన్నారు.

తొండంగి: బెండపూడి ఉన్నత పాఠశాలలో గ్రామాభివృద్ధి కమిటీ మాజీ ఛైర్మన్ సాధనాల నూకరాజు, పాలచర్లయర్రబ్బు, బూసాల శ్రీనివాసరావు, బీజేపీ నేత వెలుగుల గోపాల కృష్ణ, ధర్మరాజు, రవి విద్యామిత్ర కిట్లను పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయులు నాగం కృష్ణమూర్తి పాల్గొన్నారు. బెండపూడి నెంబర్1ప్రాథమిక పాఠశాలలో పంపిణీ చేశారు.

తునిరూరల్: తేటగుంట జిల్లా పరిషత్ హైస్కూల్, ఎంపీయూపీ స్కూల్స్‌లో జరిగిన కార్యక్రమానికి టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ గజ్జి అప్పలరాజు, గజ్జి రాంబాబు, కొల్లు సత్యనారాయణ, పేరూరి వెంకట కృష్ణ హాజరై విద్యార్థులకు కిట్లు పంపిణీ చేపట్టారు. కేజీబీవీ బాలికల పాఠశాలలో ప్రజా ప్రతినిధులు పుస్తకాల పంపిణీ చేపట్టారు. ఎస్‌వో అమృతవాణి, ఉపాధ్యాయ బృందం ఉన్నారు.

'బెదిరింపులకు పాల్పడుతున్నారు'

కాకినాడ సిటీ, ఆగస్టు 3: తమ సంస్థపై కాకినాడ రూరల్‌కు చెందిన వైసీపీ నాయకులు తప్పుడు ప్రచారం సాగిస్తున్నారని, కాకినాడలో 2022లో ఏర్పాటు చేసిన బ్రాంచ్‌ను వదిలేసి వెళ్లిపోకపోతే చంపుతామని బెదిరిస్తున్నారని ఓ ప్రైవేటు కోచింగ్ సెంటర్ సీఈవో కొప్పిశెట్టి షణ్ముఖ్ సుదర్శన్, అతడి భార్య సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ రేఖ అన్నారు. కాకినాడలో శనివారం విలేకర్లతో వారు మాట్లాడుతూ తాము కాకినాడ బ్రాంచ్‌లో భాగస్వాములుగా చేర్చుకున్న వారే తమను చంపుతామని బెదిరింపులకు పాల్పడుతున్నారని తెలిపారు.

మహాలక్ష్మికి శాకంబరి అలంకారం



పిఠాపురంలో శాకంబరి అలంకారంలో మహాలక్ష్మి

పిఠాపురం, ఆగస్టు 3: శృంగేరి శంకర మఠం నిర్వహణలో పిఠాపురం పెద్దబజారులో ఉన్న మహాలక్ష్మి అమ్మవారికి శనివారం శాకంబరి అలంకారం చేశారు. ఆషాఢమాసంలో భాగంగా మహాలక్ష్మి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. వివిధ రకాల కాయగూరలు, పువ్వులు, పండ్లుతో అమ్మవారిని అలంకరించగా పూజల్లో అధికంగా భక్తులు పాల్గొన్నారు.

శాకంబరిగా వేగుళ్లమ్మ



గొల్లప్రోలు రూరల్, ఆగస్టు 3: గొల్లప్రోలు మండలం దుర్గాడ గ్రామదేవతగా విరాజిల్లుతున్న వేగుళ్లమ్మ శనివారం శాకంబరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆషాడ మాసం అమావాస్య సందర్భంగా అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం, సౌభాగ్య స్త్రీలచే లలిత సహస్ర నామకుంకుమార్చన నిర్వహించారు. పలురకాల కాయగూరలతో అమ్మ వారికి శాకంబరి అలంకారం చేశారు. అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తులు పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. మండలంలోని తాటిపర్తిలో అపర్ణాదేవికి ఆషాడమాసం సారె సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు జరిగాయి.

రొయ్యల పరిశ్రమలో అగ్ని ప్రమాదం

కొత్తపల్లి, ఆగస్టు 3: ఉప్పాడ బీచ్‌రోడ్డులో రొయ్యల శుద్ధి పరిశ్రమలో అగ్ని ప్రమాదం సంభవించడంతో అందులో యంత్ర పరికరాలు దగ్గం అయ్యాయి. ఎస్‌పీజీఎల్ ప్లాంటు సమీపంలో రామన్నపాలెనికి చెందిన వి.ధనబాబు రొయ్యల శుద్ధి పరిశ్రమలో అగ్ని ప్రమాదం జరిగినట్లు సమాచారం అందడంతో వెళ్లి పరిశీలించగా ఇక్కడ ఖరీదైన యంత్ర సామగ్రి, ఫర్నీచర్ అగ్నికి ఆహుతైనట్టు బాధితుడు ధనబాబు తెలిపాడు. శుక్రవారం సాయంత్రం ఆగంతకులు పరిశ్రమలోకి వెళ్లడంతో అగ్ని ప్రమాదం సంభవించి ఉంటుందని అనుమానం వ్యక్తం చేశాడు. సుమారు రూ.15 లక్షల విలువైన ఆస్తినష్టం జరిగినట్టు పేర్కొన్నాడు. అగ్ని ప్రమాదంపై శనివారం కొత్తపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

బీజేపీ సమావేశం

రౌతులపూడి, ఆగస్టు 3: గిడజాంలో శనివారం బీజేపీ మండలాధ్యక్షుడు ఉటా నాగశ్రీను అధ్యక్షతన జిల్లా బీజేపీ కిషన్ మోర్చా సమావేశం జరిగింది. జిల్లా కార్యదర్శి తంటపు రెడ్డి మాణిక్యాలరావు ఆధ్వర్యంలో ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. రాష్ట్రకార్యవర్గ సభ్యులు బొలిశెట్టి రామకృష్ణ, పిండం బాబ్జీ, వనం నాగరాజు, సింగిల్‌దేవి, యనుముల రాజా వెంకటరమణనాయుడు, లగుడు శ్రీను,శివ రామకృష్ణ పాల్గొన్నారు.

పశువుల దాణా పంపిణీ

తాళ్లరేవు, ఆగస్టు 3: పిల్లంక పంచాయతీ కొత్తలంక గ్రామంలో వరద ప్రభావంతో ఇబ్బందులు పడుతున్న పశువులకు పశుసంవర్ధకశాఖ జేడీ సూర్యప్రకాష్ పశువుల రైతులకు దాణా బ్యాగ్‌లను శనివారం పంపిణీ చేశారు. 25 టన్నుల దాణాను 556 పశువులకు సరిపడేలా అందజేశారు. ఏడీ బ్రహ్మవేద, పశువైద్యులు సుధ, మూర్తి, శ్రీనివాస్ ఉన్నారు.

ప్రత్యేక వైద్య శిబిరం

తొండంగి, ఆగస్టు 3: కొమ్మనాపల్లి గ్రామంలో శనివారం ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నందున ఏవినగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు రవికుమార్, భారతి వైద్య శిబిరం ఏర్పాటు చేసి సుమారు 100మందిని పరీక్షించగా వారిలో పలువురు జ్వరంతో బాధపడుతుండగా వైద్యం అందించారు. వైద్య సిబ్బంది చంద్రకళ, మల్లేశ్వరి, సూపర్‌వైజర్ తదితరులు పాల్గొన్నారు.

సైకిళ్లు, పుస్తకాల పంపిణీ

తునిరూరల్, ఆగస్టు 3: విద్యార్థులు రోటరీ క్లబ్ ఆఫ్ తుని సెంట్రల్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని క్లబ్ డిస్ట్రిక్ 3020 గవర్నర్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు స్పష్టం చేశారు. ఆయన చేతులమీదుగా తునిలో 200 మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు సైకిళ్లు, కంచాలు, గ్లాసు, పుస్తకాలు, బ్యాగ్స్ పంపిణీ చేశారు. అసిస్టెంట్ గవర్నర్ ఎం.పద్మావతి, డిస్ట్రిక్ సెక్రెటరీ ఎం.కల్యాణ్, క్లబ్ ప్రెసిడెంట్ చక్కా శ్రీధర్, సెక్రటరీ కృష్ణ పాల్గొన్నారు.

కొత్తపల్లిలో భారీ వర్షం

కొత్తపల్లి, ఆగస్టు 3: శనివారం తెల్లవారుజామున మండలంలో వర్షం దంచి కొట్టింది. ఈ వర్షానికి గురు, శుక్రవారాల్లో వేసిన సార్వా వరినాట్లు వర్షం నీటితో మునిగాయి. వాకతిప్ప, కొండెవరం, యండపల్లి, గోర్స తదితర గ్రామాల్లో నాట్లు వేసిన చేలల్లో వరి దుబ్బులు పైకి తేలాడాయి.

విద్యార్థికి అభినందనలు

కిర్లంపూడి, ఆగస్టు 3: సోమవరం ప్రభుత్వ పాఠశాలలో 9వతరగతి విద్యార్థి మదీన శివదుర్గ నవోదయకు ఎంపికయ్యాడు. శివదుర్గను సర్పంచ్ సీతా రామలక్ష్మి, హెచ్ఎం టి.కాంతారావు, ఉపాధ్యాయులు ఎస్.కన్నబాబు, గ్రామ పెద్దలు మంచకంటి శ్రీను, రాజు, సూతి శ్రీను, రవి వర్మ, జ్యోతుల కోటేశ్వరరావు, పేపకాలయ బుజ్జి, నాగు అభినందించారు.